ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి
ఆదివారం | 21 డిసెంబరు, 2025 | పేజీలు :08

## ఎన్నికల్లో అందరూ సమష్టిగా పనిచేయడం అభినందనీయం



2 లో

# సురక్షిత డ్రైవింగ్‌తో ప్రమాదాల నివారణ

జాతీయ రహదారి భద్రత మాహోత్సవాలు..
2026ను విజయవంతంగా నిర్వహించాలి..
రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్..

**ప్రజాపక్షం/కలెక్టరేట్ :**సురక్షిత డ్రైవింగ్ విధానంతో రహదారి ప్రమాదాలను నివారించవచ్చని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.శనివారం జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు,రవాణా శాఖ స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్,లా అండ్ ఆర్డర్ డిజి మహేష్ భగవత్ లతో కలిసి హైదరాబాద్ నుంచి రహదారి భద్రత మాహోత్సవాల నిర్వహణపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ,రాష్ట్రవ్యాప్తంగా రహదారి భద్రత మాహోత్సవాలు ఘనంగా నిర్వహించాలని అన్నారు.ఈ మాహోత్సవాల్లో భాగంగా వివిధ రకాల కార్యక్రమాలు చేపట్టడం ద్వారా ప్రజలకు రోడ్డు భద్రతపై అవగాహన కలుగుతుందని చెప్పారు.రోడ్డు ప్రమాదాలలో ప్రతి రోజు ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని,రహదారి భద్రత నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలు తగ్గుతాయని వివరించారు.పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులకు రహదారి భద్రత నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలు తగ్గుతాయని వివరించారు.పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులకు రహదారి భద్రత నియమాలపై అవగాహన కల్పించాలని తెలిపారు.ఈ కార్యక్రమలలో అధికారులను,ప్రజలను పెద్ద ఎత్తున భాగస్వామ్యం చేయాలని అన్నారు.రహదారి నియమాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం ద్వారా ప్రమాదాలు నివారించవచ్చునని పేర్కొన్నారు.జిల్లా స్థాయి రహదారి భద్రత కమిటీల సమావేశాలు ఎప్పటికప్పుడు నిర్వహిస్తూ ఉండాలని తెలిపారు.రహదారులపై తరచూ ప్రమాదాలు సంభవించే ప్రదేశాలను గుర్తిస్తు,తగు రక్షణ చర్యలను చేపట్టాలని సూచించారు.డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.వాహన చోదకులందరూ సీట్ బెల్ట్,హెల్మెట్ లు ధరించేలా పర్యవేక్షణ ఉంచాలని మంత్రి తెలిపారు.ఈ వీసీ లో భాగంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మాట్లాడుతూ,జాతీయ రహదారి భద్రత మాహోత్సవాల కార్యక్రమాలను తరువాయి 2లో



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న పొన్నం

# ధాన్యం అవినీతిపై చర్యలు

డిసిఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి

**ప్రజాపక్షం/ధర్మపురి :** జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం లోని జైన సహకార సంఘం పరిధిలో ధాన్యం కొనుగోలు లో అవినీతికి పాల్పడ్డ వారిపై విచారణ జరిపి వెంటనే చర్యలు తీసుకోవాలని ఉమ్మడి కరీంనగర్ మాజీ డిసిఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ధర్మపురి శ్రీ లక్ష్మి నరసింహస్వామి దయతో గెలిచినా నియోజకవర్గ పరిధిలో ఎలాంటి అవినీతిని సహించేది లేదని చెప్పే మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జైనలో ధాన్యం కొనుగోలు లో జరిగిన అవినీతి పై చర్యలు తీసుకొని తన నిజాయితీని ప్రజలకు తెలియజేయాలని అన్నారు. జైన పీఏసీఎస్ పరిధిలో జరిగిన మోసాలపై ధర్మారం కు చెందిన ఓ మిల్లర్ కలెక్టర్ కు ఫిర్యాదు చేయగా అదనపు కలెక్టర్ బిఎస్సి లత తనిఖీలలో అవినీతి బయటపడ్డప్పటికీ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వారిపై చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. పైగా వారిని రక్షించే ప్రయత్నం చేశారని శ్రీకాంత్ రెడ్డి ఆరోపించారు. సన్న రకం వడ్లను కొనుగోలు చేసి దొడ్డు వడ్లుగా రికార్డు చేసుకున్నారనే విషయం అదనపు కలెక్టర్ తనిఖీలో స్పష్టంగా బయటపడిందని అన్నారు. అదనపు కలెక్టర్ భాద్యులపై చర్యలు తీసుకోవాలని, సస్పెండ్ చేయాలని ఆదేశాలు ఇచ్చినా ఇంతవరకు చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా అవినీతికి పాల్పడిన జైన పీఏసీఎస్ చైర్మన్ నరేష్ పై చర్యలు తీసుకొని చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు. ధర్మపురి నియోజకవర్గంలో 20 సంవత్సరాల నుండి ఎటువంటి అవినీతి జరగకుండా పాలన సాగిందని నేడు ఇంత పెద్ద కుంభకోణం జరగడం విస్మయానికి గురి చేసిందన్నారు. చర్యలు తీసుకోని పక్షంలో రైతు వద్దకు వెళ్లి వారి ద్వారా ప్రజలకు జరిగిన మోసాలను వివరిస్తామని శ్రీకాంత్ రెడ్డి హెచ్చరించారు. ఈ సమావేశం లో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అయ్యోరి రాజేష్, ఓడ్నాల మల్లేశం, సంగి శేఖర్,చిలువేరి శ్యామ్, స్తంభం కాడి మహేష్, ఆసిఫ్, వేణుగోపాల్, యూనస్,నక్క రాజేందర్, జెట్టి రాజన్న, చిర్నేని నరసయ్య, వేములనరేష్,పాల్గొన్నారు.





# ఫెర్టిలైజర్ యాప్‌పై విస్తృత అవగాహన

ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** రైతులు ఎరువుల కోసం పడే ఇబ్బందులు దూరం చేసేందుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన ఫెర్టిలైజర్ యాప్ పై విస్తృత అవగాహన కల్పించాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. ఫెర్టిలైజర్ యాప్ పై అవగాహన, ఆయిల్ పామ్ లక్ష్యం తదితర అంశాలపై జిల్లాలోని వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు, పీఏసీఎస్ సీఈఓలతో సమీక్ష సమావేశం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. రాష్ట్ర వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన ఫెర్టిలైజర్ యాప్ రైతులు డౌన్ లోడ్ చేసుకునేలా చూడాలని, దాని ద్వారానే ఎరువులు బుకింగ్ చేసుకోవాలని స్పష్టం చేశారు. అన్ని ఫెర్టిలైజర్ షాప్ లు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద ఫెర్టిలైజర్ యాప్ వివరాలతో కూడిన ఫ్లెక్సీ ఏర్పాటు చేయాలని, అలాగే హెల్ప్ డెస్క్, ఒక సహాయకుడు ఉండాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు తమ పరిధిలోని అన్ని ఫెర్టిలైజర్ షాప్ లు, పీఏసీఎస్ లలో ఎరువుల విక్రయాలు, నిలువ, ఎంత స్టాక్ ఉందో రోజూ నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

**ఆయిల్ పామ్ లక్ష్యం చేరుకోవాలి:**వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు, పీఏసీఎస్ సీఈఓలకు కేటాయించిన లక్ష్యాన్ని చేరుకోవాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. రైతులను కలిసి ఆయిల్ పామ్ సాగుతో లాభాలను వివరించాలని, సబ్సిడీలు, ప్రోత్సహకాలు, పంట ఉత్పత్తులకు మద్దతు ధర, అందుబాటులో ఫ్యాక్టరీ ఉందని విషయాలు తెలుపాలని, సాగుతో లాభాలు తెలియజేసి సాగు విస్తీర్ణం పెంచాలని సూచించారు. పలువురు వ్యవసాయ అధికారులు, పీఏసీఎస్ సీఈఓలు ఆయిల్ పామ్ పెంపునకు కృషి చేస్తుండడంతో వారిని అభినందించారు. ఆయిల్ పామ్ సాగు చేసేందుకు ఆసక్తి ఉన్న రైతులకు జిల్లాలో ఇప్పటికే పంట ఉత్పత్తులు వచ్చిన రైతుల క్షేత్రాలు చూపించాలని, అలాగే సిద్ధిపేట జిల్లాలోని తరువాయి 2లో

# 22న మీ డబ్బు.. మీ హక్కు కార్యక్రమం



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** క్లెయిమ్ చేసుకోని ఆర్థికపరమైన ఆస్తుల కోసం ఈ నెల 22 వ తేదీన మీ డబ్బు మీ హక్కు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ప్రోగ్రామ్ కన్వీనర్, లీడ్ బ్యాంక్ మేనేజర్ మల్లికార్జున రావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మధ్యాహ్నం 01.00 గంటల నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని ఆర్థిక సేవల విభాగం ఆదేశాలకు అనుగుణంగా మీ డబ్బు, మీ హక్కు అనే ఇతివృత్తంతో క్లెయిమ్ చేసుకోని ఆర్థికపరమైన ఆస్తుల సమస్యను పరిష్కరించేందుకు కేంద్ర ఆర్థిక మంత్రి 2025 అక్టోబర్ 4వ తేదీన గుజరాత్‌లోని గాంధీనగర్‌లో జాతీయ స్థాయి కార్యక్రమాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. 2025 డిసెంబర్ 31వ తేదీ వరకు మూడు నెలల పాటు కొనసాగుతుందని తెలిపారు. క్లెయిమ్ చేసుకోని బ్యాంకు పొదుపులు, షేర్లు, డివిడెండ్లు, మ్యూచువల్ ఫండ్లు, బీమా తదితరాలను క్లెయిమ్ చేసుకునేందుకు వీలు కల్పించాలన్న లక్ష్యంతో దీనిని చేపట్టారని వివరించారు. బ్యాంకుల్లో 10 సంవత్సరాలకు పైగా క్లెయిమ్ చేసుకోని డిపాజిట్ల వివరాలు ఆర్‌బీఐ ఉద్గమ్ వెబ్‌సైట్ (https:// udgam. rbi. org. in) ద్వారా పొందొచ్చని తెలిపారు. క్లెయిమ్ చేసుకోని ఆర్థికపరమైన ఆస్తుల వాస్తవ యజమానులు వాటిని పొందేందుకు.. బ్యాంకు శాఖ, భీమా సంస్థ, మ్యూచువల్ ఫండ్ సంస్థ, శిబిరంలోని స్టాక్ బ్రోకరేజీ సంస్థ, ఆన్‌లైన్ ద్వారా స్టాక్ బ్రోకర్‌లలో దేనినైనా సంప్రదించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రోగ్రా మ్ కన్వీనర్, లీడ్ బ్యాంక్ మేనేజర్ మల్లికార్జున రావు సూచించారు.

**జీపీ ఎన్నికల విజయవంతంపై ఇంచార్జి కలెక్టర్ కు శుభాకాంక్షలు:**గ్రామ పంచాయతీ ఎన్నికలు జిల్లాలో విజయవంతంగా పూర్తయిన నేపథ్యంలో ఇంచార్జి కలెక్టర్ గరి మ అగ్రవాల్‌కు ఎంపీడీఓలు, జిల్లా పంచాయతీ కార్యాలయం సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ను శనివారం ఎంపీడీఓలు, జిల్లా పంచాయతీ కార్యాలయాల అధికారులు మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ కు పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఉపాధ్యాయులకు సిసిఎల్ మంజూరు వినతి

### స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజగౌడ్ వినతిపత్రం

**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమికృత భవనంలో టి.ఎస్. యూ.టీఫ్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజగౌడ్ ను కలిసి పంచాయతీ ఎన్నికలు సజావుగా నిర్వహించినందుకు అభినందనలు తెలిజేశారు. రెండవ శనివారం, ఆదివారం సెలవులలో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు సిసియల్ మంజూరు చేయాలనీ అదనపు కలెక్టర్ వినతిపత్రం అందజేశారు. జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తిరుకోవెల శ్యామ్ సుందర్, అంబటి భూమేశ్వర్, జిల్లా ఉపాధ్యక్షులు డా. టి. శ్రీనివాస్, కార్యదర్శులు శ్రీధర్, బల్ల సత్యనారాయణ, నరేష్, రవి కుమార్, నాగరాజు, తిరుపతి, జయంత్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## అన్యమత ప్రచారంపై చెలరేగిన వివాదం

**ప్రజాపక్షం/మల్లాపూర్:** మండలంలోని పాతదామరాజు పల్లి గ్రామంలో అన్యమత ప్రచారంపై కొందరు వ్యక్తులు వాహనం ద్వారా ప్రచారం చేస్తున్నారని బజరంగ్ దళ్ నాయకులు , పలువురు గ్రామస్తులు అడ్డుకోవడం వివాదానికి దారితీసింది. అన్యమత ప్రచారం చేస్తూ వాహనంలో గ్రామంలో తిరుగుతుండగా అడ్డుకోవడంతో ఉద్రిక్తగా మారడంతో విషయం తెలుసుకున్న ఎస్సై కోసన రాజు సంఘటన స్థలానికి చేరుకొని మాట్లాడారు. కొద్ది సేపు వాదోపవాదనాలు జరగాగా విషయం కాస్త పోలీస్ స్టేషన్ వరకు చేరినట్లు సమాచారం.

## బాధితురాలి కుటుంబానికి పరామర్శ



**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని ఓడేడు గ్రామానికి చెందిన మేడిపల్లి రాధమ్మ మరణించగా వారి కుటుంబాన్ని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పోతిపెద్ది కిషన్, షేర్ స్వామి, కట్ల శ్రీనివాస్ లు శనివారం పరామర్శించి మృతురాలి చిత్రపటానికి పూలమాలలు వేసి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. వారి వెంట షేర్ స్వామి, కట్ల శ్రీనివాస్ తో పాటు తదితరులు ఉన్నారు.

## సైబర్ నేరాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాపక్షం/చొప్పదండి:**సైబర్ నేరాల పట్ల యువత, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చొప్పదండి ఎస్సై నరేష్ రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంటెడ్ స్కూల్ లో c పైసా పైలంe కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లోని పాఠశాలల్లో ఉన్న విద్యార్థులు, యువత, ప్రజలకు సైబర్ భద్రత, సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించి, సైబర్ నేరాలను నివారించడమే తమ లక్ష్యం అన్నారు. బిజినెస్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ మోసాలు, ఐడెంటిటీ థెఫ్ట్, లోన్ మోసాలు , ప్రకటనల మోసాలు ఆన్‌లైన్ భద్రతల పై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రస్తుతకాలంలో వాట్సాప్, ఫేస్బుక్, ఇన్స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియాను పిల్లలు ఎక్కువగా వాడుతున్నారని, వాటిని వాడేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తల్లి దండ్రులు పిల్లలకు వివరించాలన్నారు. సైబర్ నేరానికి గురైన వెంటనే 1930కి కాల్ చేసి పిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి. విద్యార్థులు,పాఠశాల సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రామగుండంలో ప్రజావ్యతిరేక దుర్మార్గపు పాలన :చందర్

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** రామగుండం లో ప్రజా వ్యతిరేక దుర్మార్గపు పాలన సాగుతుందని ప్రజా ధన వృధా చేస్తున్నరని కుల్చివేతలు కమీషన్ల కోసమేనని పార్కింగ్ కాంప్లెక్స్ ను వెంటనే పూర్తి చేయాలనీ రామగుండం మాజీ శాసనసభ్యులు పెద్దపల్లి జిల్లా బీ.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షులు కోరుకంటి చందర్ డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ రెండేళ్ల పాలనపై విడుదల చేసిన ఛార్జ్ షీట్ లోని పార్కింగ్ కాంప్లెక్స్ నిర్మాణం పట్ల ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ బి ఆర్ఎస్ శ్రేణులతో కలిసి శనివారం గోదావరిఖని పాత మున్సిపల్ కార్యాలయంలో ఆగిపోయిన పార్కింగ్ కాంప్లెక్స్ ను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీ.ఆర్.ఎస్ ప్రభుత్వంలో సిఎం గ్రాంట్ 200 కోట్ల నిధుల ద్వారా రామగుండంలోనీ ప్రతి డివిజన్ లో డ్రైనేజీలు, రోడ్ల మరమ్మతులు, ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్ పనులను పూర్తి చేయడం జరిగిందని, సోమారపు సత్యనారాయణ ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో ప్రపోజల్ చేసిన పార్కింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి తాను ఎమ్మెల్యేగా అయిన తర్వాత భూమిపూజ చేసి దాదాపు 3 కోట్లకు పైగా నిధులను పుట్టింగ్ వర్క్, పిల్లర్ వర్క్ చేయడం జరిగిందన్నారు. వ్యాపార కూడలి లక్ష్మీ నగర్ లో ట్రాఫిక్ నియంత్రణ కోసం ప్రారంభించిన పార్కింగ్ కాంప్లెక్స్ ప్రస్తుత ఎమ్మెల్యే పూర్తి చేయాల్సిన బాధ్యత ఉండగా కనీసం ఎమ్మెల్యే గాని, కలెక్టర్‌గాని ఆ కాంప్లెక్స్ వైపు చూసిన పాపాన పోలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో మూల విజయ రెడ్డి ,గోపు అయులయ్య యాదవ్ ,కల్వచర్ల కృష్ణవేణీ ,జనగామ కవిత, సరోజిని ,నూతి తిరుపతి, బొడ్డపల్లి శ్రీనివాస్, నారాయణ,దాసు మారుతి ,దొమ్మేటి వాసు , పిల్లి రమేష్ ,నీరటి శ్రీనివాస్,ఆర్శనపల్లి శ్రీనివాస్, నిమ్మరాజుల సాగర్, యాసర్ల తిమోతి ,ఇరుగురాళ్ల శ్రావన్ ,కొడి రామకృష్ణ ,జిట్టవేని ప్రశాంత్ ,ముదిరాజ్ మీర్ ఫయాజ్ ,అవునూరి వెంకటేష్, బచ్చాల రాములు, చింటూ, వీరాలాల్ కిరన్ ,జీ గుంపుల లక్ష్మి , గుర్రం పద్మ ,రమ్య యాదవ్, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

## చిరు వ్యాపారులకు అండగా ఉంటా :హరీష్ రెడ్డి



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలో చిరు వ్యాపారులకు అండగా నిలుస్తానని, కాలుష్య కోరల్లో నుండి పారిశ్రామిక ప్రాంతాన్ని కాపాడాలని వ్యాల్ల హరీష్ రెడ్డి అన్నారు. శనివారం రోజున స్థానిక స్వాగత్ గార్డెన్లో చిరు వ్యాపారుల నూతన కమిటీని ఎన్నుకున్నారు. బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, వీహెచ్ ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు వ్యాల్ల హరీష్ రెడ్డిని గౌరవాధ్యక్షునిగా,అధ్యక్షునిగా ఎస్ కే.మోయినుద్దీన్, ఉపాధ్యక్షులుగా ఇస్మాయిల్ బాబా, ముఖ్య సలహాదారులుగా ఎండి జావిద్ పాషా, ప్రధాన కార్యదర్శిగా ఎస్కే కిషన్ సింగ్, కోశాధికారిగా ఎండి ముజాహిద్, సలహాదారులుగా బూరుగు వంశీకృష్ణ, సంయుక్త కార్యదర్శిగా తిరుపతి, కార్యవర్గ సభ్యులుగా నయీమ్, అంకుష్, తాళ్లపల్లి సమ్మయ్య, సందీప్, ఇమామ్, సాహితులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కమిటీ అని హరీష్ రెడ్డి ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మిక రంగ క్షేత్రంలో గత రెండు మూడు దశాబ్దాలుగా చిరు వ్యాపారం చేసుకుంటున్న వ్యాపారాలకు ప్రస్తుతం జరుగుతున్న దౌర్జన్యాలకు అండగా నిలుస్తానని, మీకు ఎలాంటి ఆపద వచ్చినా నేను వీహెచ్ ఆర్ ఫౌండేషన్ ద్వారా అన్ని విధాలుగా ఆదుకుంటానని హామీ ఇచ్చారు. ప్రస్తుతం రామగుండం పారిశ్రామిక ప్రాంతం ప్రస్తుత పాలకుల అనాలోచిత నిర్ణయాలతో కాలుష్య కోరల్లో చిక్కుకుందని, కాలుష్య కోరల నుండి బయటపడేందుకు, సురక్షిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు నేను చేసే పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యాలు కావాలని, ప్రస్తుత పాలకుల దౌర్జన్యాలకు కూల్చివేతలకు నిర్వీర్యమైన వ్యాపారాలను తిరిగి నిర్మించుకునేందుకు ప్రతి ఒక్కరు తనతో కలిసి రావాలని కోరారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు జాహిద్ పాషా, ఐత శివకుమార్, రవి నాయక్, కృష్ణస్వామి, తస్లిమా భాను, నర్సింగ్, పరుశ స్వాతి, బూరుగు వంశీకృష్ణ, మెరుగు చంద్రమౌళి, మేకల రామస్వామి, మడిశెట్టి రవీందర్, అల్లి గణేష్,బోట్ల పోషం, పాల్గొన్నారు.

## న్యూ సెంచురీ మ్యాట్రెసెస్ స్పెషలిస్ట్ స్టోర్ ప్రారంభం



**ప్రజాపక్షం/కరీంనగర్:**మూడు దశాబ్దాలకు పైగా వారసత్వం కలిగిన భారతదేశపు స్లీప్ స్పెషలిస్ట్ సెంచురీ మ్యాట్రెసెస్, కరీంనగర్‌లోని అశోక్ నగర్‌లో బొమ్మ వెంకన్న బిల్డింగ్ లో తన సరికొత్త ఎక్స్‌క్లూజివ్ సెంచురీ మ్యాట్రెసెస్ అండ్ సోఫాస్ స్లీప్ స్పెషలిస్ట్ స్టోర్‌ను విజయవంతంగా ప్రారంభించింది. ఈ స్టోర్‌ను సెంచురీ మ్యాట్రెసెస్ సోఫాస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉత్తమ్ మలానీ ప్రారంభించగా, సాయి బాలాజీ ఫర్నిచర్ ప్రొప్రైటర్లు గౌరీ శెట్టి శ్రీనివాస్, కన్నా సంతోష్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. వినియోగదారులు, పరిశ్రమ భాగస్వాములు శ్రేయోభిలాషుల నుండి ఈ ప్రారంభోత్సవానికి విశేష స్పందన లభించింది. ప్రారంభోత్సవంలో సెంచురీ మ్యాట్రెసెస్ సోఫాస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉత్తమ్ మలానీ మాట్లాడుతూ, సెంచురీలో మా దృష్టి ఎల్లప్పుడూ ఆవిష్కరణలు, సాంకేతికత మరియు వినియోగదారుకేంద్రీకృత డిజైన్ ద్వారా సౌకర్యవంతమైన నాణ్యతను మెరుగుపరచడంపైనే ఉంటుంది. వీటితో పాటు ప్రతి మ్యాట్రెస్ కొనుగోలుపై ఉచిత పిల్లో సెట్ మరియు బెడ్‌షీట్‌ను కూడా అందిస్తోందని నిర్వాహకులు పేర్కొన్నారు.

## ఫారెస్ట్ కార్యాలయం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారిందా..?

**ప్రజాపక్షం/ మల్లాపూర్ :** మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల సమీపంలో నిర్మించిన ఫారెస్ట్ సిబ్బంది కార్యాలయం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారింది. లక్షలాది రూపాయలు వెచ్చించి సిబ్బంది కోసం కార్యాలయం నిర్మించగా వాడుకలో లేకపోవడంతో ప్రతిరోజు మద్యం ప్రియులకు అడ్డాగా మారింది. ఇలా మద్యం సేవించే వ్యక్తులు బాటిల్లను పగలగొట్టి చిందరవందరగా పడేయడం, అలాగే కార్యాలయం చుట్టూ మలమూత్ర విసర్జన చేస్తుండడంతో దుర్వాసన వెదజల్లుతుంది. పట్టించుకోవాల్సిన అటవీశాఖ సిబ్బంది అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో శిథిలావస్థ భవనంగా మారి ఎటుచూచిన ముళ్ళ పొదలు పగిలిన బీరు సీసాలు సిగరెట్ ముక్కలు దర్శనమిస్తున్నాయి.ఇలా నిరూపయోగంగా ఉన్న కార్యాలయాన్ని ఉపయోగంలోకి తీసుకొస్తే బాగుంటుందని ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలు కోరుతున్నారు.

## రాష్ట్రస్థాయి జూడోపోటీలకు మానేరు విద్యార్థి ఎంపిక

**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్:**హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరగనున్న 69వ రాష్ట్రస్థాయి పాఠశాలలో అండర్ 14 బాలబాలికల జూడో చాంపియన్‌షిప్ పోటీలకు కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థల విధ్యార్థిని ఎంపికైనట్లు విద్యాసంస్థల పిఇట సిలివేరి మహేందర్ తెలిపారు. ఈ నెల 18న కరీంనగర్ ప్రాంతీయ క్రీడా పాఠశాలలలో జరిగిన ఉమ్మడి జిల్లాస్థాయి పోటీల్లో 23 కేజీల లోపు బాలికల విభాగంలో పాఠశాలకు చెందిన బండారి జాహ్నవి అద్వితీయ ప్రతిభ కనబరిచి బంగారు పతకాన్ని కైవసం చేసుకుని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ సంధర్భంగా శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో జాహ్నవిని విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి అభినందించారు. రాష్ట్రస్థాయిలో రాణించి బంగారు పతకాన్ని కైవసం చేసుకుని జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావాలని సూచించారు. విధ్యార్థిని మానేరు విద్యాసంస్థల డైరెక్టర్ కడారి సునీతారెడ్డి, ప్రిన్సిపాల్ జి.సరితారెడ్డి పాటు పిఇటిలు మహేందర్, జహీదా, తిరుపతి, స్వామి, ఉపాధ్యాయులు విధ్యార్థులు అభినందించారు.

## సోషల్ మీడియా ద్వారా విరాళాల సేకరణ

**ప్రజాపక్షం /మల్లాపూర్ :** మండలంలోని మొగిలిపేట గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న కోటిలింగేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి మండల కేంద్రానికి చెందిన రామగిరి వసంత తనవంతుగా వినూత్నంగా విరాళాలను సేకరించారు. ఫేస్బుక్ ఇన్స్టాగ్రామ్ సోషల్ మీడియా ద్వారా సుమారు 150000 వేల రూపాయల విరాళాలను సేకరించి మొగిలిపేట గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులకు శనివారం అందజేశారు.

# జగిత్యాల మెడికల్ హబ్‌గా రూపుదిద్దుకుంటుంది : ఎమ్మెల్యే



**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** జగిత్యాల నియోజకవర్గంలోని పలువురికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను శనివారం జగిత్యాల ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనారోగ్యంపాలై ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన వారి కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. గత ప్రభుత్వంలో సీఎంఆర్ఎఫ్ ద్వారా ఏడాదికి ఎనిమిది వందల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తే ఈ ప్రభుత్వం ఏడాదికి రూ .1800 కోట్లు వెచ్చిస్తోందన్నారు. ప్రభుత్వ వైద్య సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనే గొప్ప సంకల్పంతో గ్రామ గ్రామాన పల్లె దవాఖానాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే జగిత్యాల నియోజకవర్గంలో 14పల్లె దవాఖానా పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. అలాగే రాయికల్‌లో ప్రభుత్వ ఆసుపత్రి బీర్పూర్ మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరు చేయించి రూ. 1.40 కోట్లతో పనులు చేపట్టినట్లు తెలిపారు.

**జగిత్యాల మెడికల్ హబ్ గా రూపుదిద్దుకుంటుంది జగిత్యాల ఎమ్మెల్యే :** జగిత్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి జిల్లాలోని 20 మండలాలతో పాటు చుట్టుపక్క జిల్లాలకు చెందిన వారు కూడా వైద్య సేవల కోసం వస్తున్నారని, వారందరికీ మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు జగిత్యాల ఎమ్మెల్యే తెలిపారు. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి అనుబంధంగా మరో 230 పడకల ఆసుపత్రి మంజూరయిందని, రూ. 204 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. దానికి సంబంధించిన టెండర్ ప్రక్రియ పూర్తయిందని, త్వరలోనే పనులు ప్రారంభం అవుతాయన్నారు. కొత్త బస్టాండ్ చేరువలో ఏర్పాటు కానున్న ప్రభుత్వ ఆసుపత్రికి బస్సు దిగి నడిచి వెళ్లి వైద్య సేవలు పొందవచ్చని జగిత్యాల ఎమ్మెల్యే అన్నారు. కొందరు మిడిమిడి జ్ఞానంతో మెడికల్ కళాశాల పనులు టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే 80 శాతం పూర్తయ్యాయని కేవలం మిగిలిన 20 శాతం పనులను పూర్తి చేయడంలో ప్రభుత్వం విఫలమైందంటూ విమర్శలు చేశారన్నారు.

**– మిడిమిడి జ్ఞానంతో మాట్లాడిన వారి మాటలను పట్టించుకోను జగిత్యాల ఎమ్మెల్యే :** నేను రాజకీయం రాజకీయంగానే చేస్తా... ఎవరు ఏదో మాట్లాడినట్టు నేను మాట్లాడను అని మహాభార యుద్ధంలో అశ్వద్ధామ హతః అని పెద్దగా అరిచి కుంజరః అంటూ చిన్నగా మాట్లాడటం వల్ల మహాభారత యుద్ధమే మారిపోయింది అని జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ అన్నారు.మొన్న డిసిసి అధ్యక్షుడు నందయ్య మాట్లాడినట్లు కేసీఆర్ పోటీ చేసినప్పుడే జగిత్యాలలో మూడో స్థానం దక్కిందనే విషయాన్ని కోరుట్ల ఎమ్మెల్యే గమనించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసి ఛైర్మెన్ కొలుగూరి దామోదర్ రావు, మాజీ జడ్పీటీసీ ముస్కు ఎల్లారెడ్డి, సర్పంచ్ బాపిరాజు, ముక్క వెంకటేష్ యాదవ్, మాజీ సర్పంచ్ రవి, తిరుపతి,తదితరులు పాల్గొన్నారు.

## జగిత్యాల జిల్లా కేంద్రంలో వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు

**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** ఉద్యోగ ఉపాధ్యాయ, జర్నలిస్ట్ కుటుంబాలకు వైద్య సేవలు అందించేందుకు వెల్ నెస్ హెల్త్ సెంటర్‌ను జగిత్యాల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయాలని జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్‌కి పి.ఆర్.టి .యు.టి.ఎస్ జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బోయిని పెల్లి ఆనంద్ రావు, యాల్ల అమర్నాథ్ రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కుంభాల శ్రీనివాసరెడ్డి వినతి పత్రం అందజేశారు. జనరల్ సర్జరీ కార్డియాలజీ నెఫ్రాలజీ పీడియాట్రిక్స్ న్యూరాలజీ డెర్మటాలజీ వంటి సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను వెల్ నెస్ సెంటర్‌లో అందుబాటులోకి తీసుకురావాలని వారు కోరారు.

## రానున్న ఎన్నికల్లో బిఆర్ఎస్ సత్తా చాటడం ఖాయం

### చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకే రవి శంకర్



**ప్రజాపక్షం/చొప్పదండి:** బిఆర్ఎస్ బలపరిచిన సర్పంచ్, వార్డ్ సభ్యుల అభ్యర్థులు గెలుపొందిన విధంగా రాబోవు ఎన్నికల్లో తెలంగాణలో బిఆర్ ఎస్ సత్తా చాటడం ఖాయమని బిఆర్ఎస్ చొప్పదండి నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ ధీమా వ్యక్తం చేశారు. శనివారం బూరుగుపల్లి లోని పార్టీ కార్యాలయంలో చొప్పదండి మండలం లో గెలిచిన సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డ్ మెంబర్లు కు శాలువాల తో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వెలుబడ్డ సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటి సమాధానం ప్రజలు ఇచ్చారని, ప్రతి పల్లెల్లో కేసీఆర్ పాలననే శ్రీరామరక్ష అని ప్రజలు గ్రహించారన్నారు. వచ్చే రెండేళ్లలో బిఆర్ఎస్ ప్రభుత్వమేనని జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికల్లో ఇదేవిధంగా ముందుకు వెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. ప్రజలు ఎంతో నమ్మకంతో గెలిపించిన మిమ్మలిని వారి ఆశలను వమ్ము చేయకుండా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటారని హామీ ఇచ్చారు.

## పేదప్రజల పొట్ట కొట్టడమే దేశభక్తా?

### సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్



**ప్రజాపక్షం/కరీంనగర్:** కేంద్రం లోని బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసి, వి బి జి రాంజీ పేరుతో కొత్త చట్టం చేసిందని, దేశ పేద ప్రజల పొట్ట కొట్టడమే దేశభక్త అని సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి ప్రశ్నించారు. శనివారం రోజున స్థానిక గీతా భవన్ చౌరస్తాలో (వికసిత్ భారత్ రోజ్గార్ అజీవిక మిషన్ (గ్రామీణ) విబిజి రాంజీ చట్టాన్ని నిరసిస్తూ బిల్లు ప్రతులను దహనం చేశారు. కేంద్ర బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేస్తూ, కేందర్ం తీసుకొస్తున్న వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్ గార్ అండ్ అజీవిక మిషన్ 2025 పథకాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.గ్రామీణ ఉపాధి హామీ పథకం వామపక్షాల పోరాటంతో సాధించుకున్న చట్టమన్నారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత బడ్జెట్లో నిధులు తగ్గిస్తూ పేద ప్రజల పొట్టగొట్టడమే కాకుండా పథకాన్ని నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్ శక్తులకు అనుకూల చట్టం తీసుకొచ్చిందని విమర్శించారు. వ్యవసాయ కూలీల పని దినాలను, వేతనాన్ని పెంచి, ఉపాధికి గ్యారెంటీ ఇవ్వాల్సిన కేంద్ర ప్రభుత్వం, అందుకు భిన్నంగా పేర్లను మార్చి పని దినాల సంఖ్యను తగ్గించి, నిర్వహణ భారాన్ని రాష్ట్రాలపై మోపుతామనడం అన్యాయం అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఉప్పునుటి శ్రీనివాస్, ఎడ్ల రమేష్, కోనేటి నాగమణి, డి.నరేష్ పటేల్, జిల్లా నాయకులు గజ్జల శ్రీకాంత్, రాయికంటి శ్రీనివా స్, కాంపెల్లి అరవింద్, పుల్లెల మల్లయ్య, కనకరాజు, రా కేష్,శివ,మహేష్,శ్రీకాంత్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలను విజయవంతం చేయాలి



**ప్రజాపక్షం/కరీంనగర్:**జనవరి మాసంలో నిర్వహించే జాతీయ రహదారి భద్రతా మాస ఉత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారి భద్రత మాస ఉత్సవాలపై రవాణా, ఆర్ అండ్ బి, వైద్యశాఖ, ఆర్టీసీ, ఎక్సైజ్, పోలీస్ విద్యాశాఖ తదితర అధికారులతో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రోడ్లు భవనాల శాఖ అధికారులు నోడల్ ఆఫీసర్లుగా ఉంటూ మాస ఉత్సవాల నిర్వహణకు ప్రణాళిక రూపొందించాలని అన్నారు. ఆర్ అండ్ బి, పోలీస్ అధికారులు సమన్వయంతో నగరంతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న చోట్లను గుర్తించాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్టీసీ ఆర్ .ఎం రాజు, డిప్యూటీ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ పురుషోత్తం, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

## శాతవాహన సైన్స్ కళాశాలలో క్రీడాశాల ప్రారంభం

**ప్రజాపక్షం/కరీంనగర్:**శాతవాహన విశ్వవిద్యాలయం లోని సైన్స్ కళాశాలలో క్రీడాశాలను ఉపకులపతి ఆచార్య ఉమేష్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలతో శారీరక దృఢత్వం వస్తుందని, విద్యార్థిని విద్యార్థులు ఒత్తిడిని జయించాలంటే క్రీడలను, ఆటలను తమ జీవితంలో భాగం చేసుకోవాలని తద్వారా మానసిక ఉల్లాసం పెరిగి ఏకాగ్రతను పెంచుకోవడానికి దోహదం చేస్తాయని, అధ్యాపకులు కూడా ఆటలతో మేధస్సు పెంచుకోవచ్చని క్యారమ్స్,చెస్, టెన్నిస్ వంటి ఆటల వల్ల ఆత్మ ధైర్యాన్ని పెంచుకోవచ్చని పిలుపునిచ్చారు. ఖేలో ఇండియా నిధుల కొరకు ప్రతిపాదనలను పంపించామని, కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయగానే ఇండోర్ స్టేడియంని నిర్మిస్తామని తద్వారా విశ్వవిద్యాలయంలో క్రీడలకు అత్యున్నత స్థానమిస్తామని, అన్ని రకాల క్రీడలలో విద్యార్థులకు శిక్షణ ఇచ్చి విశ్వవిద్యాలయాన్ని క్రీడలలో కూడా ముందుండేలా తయారు చేస్తామని తెలిపారు. విద్యార్థులతో అధ్యాపకులతో టెన్నిస్, క్యారమ్స్, చెస్ ఆడారు. ఈ కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ డా।। ఎస్.రమాకాంత్, స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ డా।। నజీముద్దీన్ మున్వర్, కోఆర్డినేటర్ డా।। కృష్ణ కుమార్, ఫిజికల్ డైరెక్టర్ విజయ్ కుమార్, అధ్యాపకులు డా।। డి. సురేష్ కుమార్, డా।। జెయంతి, డా।। సరసిజ, డా।। ప్రసాద్, డా।జోసెఫ్, డా।విజయకుమార్, డా।శ్రీవిద్య, శీను,సైన్స్ కళాశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ముందస్తు అంతర్జాతీయ ధ్యాన దినోత్సవం



**ప్రజాపక్షం/చొప్పదండి:**చొప్పదండి పట్టణంలోని గీర్వాణి పాఠశాలలో శనివారం అంతర్జాతీయ ధ్యాన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యోగ మాస్టర్ మాట్లాడుతూ ధ్యానం చేయడం వల్ల చాలా ప్రయోజనాలు ఉన్నాయని, రోగనిరోధక శక్తిని పెంచుతుందని, దీక్ష పట్టుదల సంకల్పం లక్ష్యసాధన గల నవ సమాజ నిర్మాణానికి ధ్యానం ఒక వారధి అవుతుందన్నారు. దీన్ని మనసా, వాచా, కర్మణా, త్రికరణశుద్ధిగా చేయాలని విద్యార్థులకు బోధించారు. ఈ కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ సొప్పరి ప్రతాప్, యోగ మాస్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కోఆర్డినేటర్స్ కోడూరి నాగరాజు, సిరిపురం శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బిజెపి మండల ప్రధాన కార్యదర్శి పదవికి రాజీనామా

**ప్రజాపక్షం/వీణవంక:**వీణవంక మండలం కనపర్తి గ్రామానికి చెందిన సీనియర్ బిజెపి నాయకుడు, మండల బిజెపి ప్రధాన కార్యదర్శి ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేశాడు. ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో తాను కనపర్తి గ్రామ సర్పంచ్‌గా బిజెపి బలపరిచిన అభ్యర్థిగా పోటీ చేశానని, తనకు బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, వీణవంక మండల అధ్యక్షుడు బత్తిని నరేష్‌లు తీవ్ర అన్యాయం చేశారని వాపోయారు. తమ గ్రామానికి ఈటల రాజేందర్ వస్తే ఫలితం వేరేలా ఉండేదని, ఆయన ప్రచారానికి వస్తే తనకు పార్టీ నుంచి ఎలాంటి సహకారం ఉండదని తేల్చి చెప్పారని పేర్కొన్నారు. ఈటల ప్రోగ్రాం క్యాన్సెల్ చేసుకుంటే ఖర్చు మొత్తం పార్టీ భరిస్తుందని, అన్ని విధాల అండగా ఉంటామని చెప్పిన జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు నరేష్‌లు చివరకు తనను మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి వారి నాయకత్వంలో పనిచేయడం ఇష్టం లేక తన పదవికి రాజీనామా చేస్తున్నానని తెలిపారు. ఇప్పటికైనా బిజెపి రాష్ట్ర నాయకత్వం కలగజేసుకుని పార్టీని బ్రతికించాలని విజ్ఞప్తి చేశారు.

## కాంగ్రెస్‌లో రామకృష్ణాపూర్ సర్పంచ్ చేరిక



**ప్రజాపక్షం/వీణవంక:**వీణవంక మండలంలోని రామకృష్ణాపూర్ గ్రామ సర్పంచ్ ఇండిపెండెంట్‌గా గెలుపొందిన త్రివేణి రాజు ఇల్లంతకుంట మండలంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ ఆద్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు చింతల శ్యాంసుందర్ రెడ్డి, హిమ్మత్‌నగర్ సర్పంచ్ జడల శ్రీకాంత్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## అభిమానంతో మొక్కుతీర్చు కున్న వృద్ధురాలు

**ప్రజాపక్షం/మల్యాల :** జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేటకు చెందిన ఓ వృద్ధురాలు మోకాళ్ల మీద నడిచి తన మొక్కు చెల్లించికుంది. వివరాల్లోకి వెళితే ముత్యం పేట ఎస్సీ కాలనీకి చెందిన దుబ్బాక నర్సవ్వ అనే వృద్ధురాలు తను అభి మానించే నాయకుడు ముత్యంపేట గ్రామ సర్పంచ్ గా దారం ఆది రెడ్డి విజయం సాధిస్తే కొండగట్టు అంజన్న ఆలయం చుట్టూ మోకాళ్ల మీద 5 ప్రదిక్షణలు చేస్తానని మొక్కుకుంది.ఇటీవల జరిగిన ఎన్నికల్లో దారం ఆది రెడ్డి ఘన విజయం సాధించడం తో ,అంజన్న తన మొక్కు తీర్చడనీ నర్సవ్వ శనివారం కొండగట్టు అంజనేయ స్వామికి తన మొక్కును చెల్లించుకుంది.ఈ సందర్భంగా సర్పంచ్ ఆది రెడ్డి,గ్రామ ప్రజలు,కాలనీ వాసులు ఆమెను అభినందించారు.

## మార్కెట్ కమిటీ అధ్యక్షుడిగా విజయ్‌కుమార్ విజయం

ప్రజాపక్షం/మందమర్రి:మందమర్రి మార్కెట్ వ్యాపార సంక్షేమ సంఘం అధ్యక్ష ఎన్నికల్లో తమ్మిశెట్టి విజయ్‌కుమార్ ఘన విజయం సాధించారు. స్థానిక మార్కెట్ హనుమాన్ దేవాలయ సత్రంలో శుక్రవారం నిర్వహించిన ఎన్నికల్లో వ్యాపార వర్గాల మద్దతుతో ఆయన ప్రత్యర్థిపై భారీ మెజారిటీతో గెలుపొందారు. ఉదయం 8 గంటల నుండి ప్రశాంత వాతావరణంలో ఓటింగ్ ప్రక్రియ కొనసాగింది. మొత్తం 511 ఓట్లకు గాను 482 ఓట్లు పోలవగా తమ్మిశెట్టి విజయ్‌కుమార్‌కు 300 ఓట్లు లభించాయి. ఆయన ప్రత్యర్థి మాయ రమేష్‌కు 169 ఓట్లు వచ్చాయి. 13 ఓట్లు చెల్లనివిగా అధికారులు ప్రకటించారు. ఎన్నికల కన్వీనర్ బీరం రవి ఆధ్వర్యంలో ఈ ఎన్నికల ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించబడింది. విజయం అనంతరం వ్యాపారులు విజయ్‌కుమార్‌ను అభినందిస్తూ మార్కెట్ అభివృద్ధికి ఆయన నాయకత్వంలో కృషి జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గవర్నింగ్ బాడీ సభ్యులు కట్ల మోహన్, పిట్టల సుధాకర్, తౌటం శ్రీనివాస్, మాయ శ్రీనివాస్, కర్ర మహేందర్ రెడ్డి, రొడ్డ మోహన్ పాల్గొన్నారు.

## పోషకాహారోత్సవం

### ఉపాధ్యాయుడు బి రామకృష్ణ



ప్రజాపక్షం/ జన్నారం:జన్నారం మండలంలోని దేవునిగూడ ప్రాథమిక పాఠశాలలో శనివారం పోషకాహారోత్సవం ఘనంగా జరిగింది. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులు సమతుల్య ఆహారానికి సంబంధించిన వివిధ రకాల పదార్థాలను తయారు చేసి ఈ సందర్భంగా ప్రదర్శించారు. పిల్లల పెరుగుదలకు పోషకాహారం ఎంతో అవసరమని, దాని ప్రాముఖ్యత గురించి ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాఠశాల ఉపాధ్యాయులు బి రామకృష్ణ, ఎ రమేష్, జి సునీత పాల్గొన్నారు.

## ట్రాన్స్ జెండర్స్‌కు ఆర్థిక పునరావాస పథకం

ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :నిర్మల్ జిల్లాలోని అర్హులైన ట్రాన్స్ జెండర్స్ కు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక పునరావాస పథకం కింద స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఒక్కో యూనిట్‌కు రూ.75,000 చొప్పున 100 శాతం సబ్సిడీతో ఆర్థిక సహాయం అందించనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి తెలిపారు.ఈ పథకం ద్వారా జిల్లాకు మొత్తం మూడు యూనిట్లను కేటాయించారు.ఈ పథకానికి అర్హులైన 18 నుంచి 55 సంవత్సరాల వయస్సు కలిగిన ట్రాన్స్ జెండర్స్ డిసెంబర్ 31,2025లోపు అవసరమైన ధ్రువపత్రాలతో కలెక్టరేట్ కాంప్లెక్స్ లోని మహిళలు, పిల్లలు,దివ్యాంగులు,వయోవృద్ధుల,ట్రాన్స్ జెండర్స్ శాఖ జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు.అర్హులు ఈఅవకాశాన్ని సద్వినియో గంచేసు కోవాల ని కోరారు.

# మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



ప్రజాపక్షం/బైంసా:బైంసా మండలంలోని ఇలేగాం గ్రామంలో శనివారం ఎమ్మెల్యే పవర్ రామారావ్ పటేల్ నూతనంగా నిర్మించిన హనుమాన్ ఆలయాన్ని పరిశీలించారు.ప్రభుత్వం నుండి వచ్చే బిల్లు పెండింగ్ ఉందని గ్రామ అభివృద్ధి కమిటి సభ్యులు వివరించడం తో ఎమ్మెల్యే అధికారులకు ఫోన్ ద్వారా ఈ విషయాన్ని వెల్లడించారు.మంగళవారం హైదరాబాద్ కు రావాలని స్థానిక నాయకులకు సూచించారు.సమస్య ను ఎండోమెంట్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు చెప్పారు.అదే విధంగా ఆలయం చుట్టూ సి.సి.రోడ్,డ్రైనేజీ నిర్మాణానికి జనవరి లో పది లక్షల రూపాయల నిధులు ఇస్తానని,రోడ్ల నిర్మాణానికి మరిన్ని నిధులు ఇస్తానని అభివృద్ధి పనులు చేపట్టాలని సర్పంచ్ కు సూచించారు.ఎస్.సి.కమ్యూనిటీ హాల్ తో పాటు ఇతర కమ్యూనిటీ హాల్ లకు నిధులు మంజూరు చేస్తానని అన్నారు.అనంతరం గ్రామంలో ఇటీవల మాజీ సర్పంచ్ అమృత్,తో పాటు మెత్రి గంగాధర్ మృతి చెందడం తో వారి కటుంబాలను పరామర్శించారు.మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు.ఎమ్మెల్యే వెంట దేగాం సర్పంచ్ సిరం సుష్మరెడ్డి,స్థానిక సర్పంచ్ సిరం రాజమణి శ్రీనివాస్,మాజీ ఎం.పి.పి అబ్దుల్ రజాక్,సీనియర్ నాయకులు సోలంకి భీంరావ్,వెంగల్ రావ తో పాటు,ఉప సర్పంచ్ శ్రీనివాస్,వార్డ్ మెంబర్లు,గ్రామపెద్దలు బిజెపి నాయకులు ఉన్నారు.

# భవిత సెంటర్ ప్రారంభం



ప్రజాపక్షం / ఆసిఫాబాద్ టౌన్:ప్రత్యేక అవసరాల పిల్లలకు నాణ్యమైన విద్య థెరపీ మార్గదర్శక సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన భవిత సెంటర్‌ను శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆసిఫాబాద్ ఎంఎల్‌ఏ కోవలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరుకాగా జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, జిల్లా విద్యాశాఖ అధికారి దీపక్ తివారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే మాట్లాడుతూ భవిత సెంటర్లు ప్రత్యేక అవసరాల పిల్లల విద్యా మానసిక సామాజిక అభివృద్ధికి ఎంతో దోహదపడతాయని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించి వారికి తగిన సహాయం అందించడమే ఈ సెంటర్ల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

జిల్లా విద్యాశాఖ అధికారి దీపక్ తివారి మాట్లాడుతూ సమగ్ర శిక్షా అభియాన్‌లో భాగంగా భవిత సెంటర్లు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ప్రత్యేక విద్యలో శిక్షణ పొందిన సిబ్బంది ద్వారా పిల్లలకు స్పీచ్ థెరపీ ఫిజియోథెరపీ అకడమిక్ సపోర్ట్ అందించనున్నట్లు చెప్పారు. ప్రత్యేక అవసరాల పిల్లలను సమాజ ప్రధాన ప్రవాహంలోకి తీసుకు రావడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి సుభాష్ విలీన విద్యా రిసోర్స్ పర్సన్ రమణ సమన్వయకర్త కటకం మధుకర్ ప్రత్యేక ఉపాధ్యాయులు తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

## టిపిసిసి మెడికల్ సెల్ జిల్లా కోర్డినేటర్‌గా రాజ్ కుమార్



ప్రజాపక్షం/ బెల్లంపల్లి:మంచిర్యాల జిల్లా టిపిసిసి డాక్టర్స్ సెల్, మెడికల్, హెల్త్ వింగ్ జిల్లా కోర్డినేటర్‌గా కొత్తపల్లి రాజ్ కుమార్ (శ్యామ్) నియామకమయ్యారు. ఈ మేరకు టిపిసిసి మెడికల్ సెల్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ రాజీవ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకం తక్షణమే అమలులోకి వస్తుందని ఆయన పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లాలో పార్టీ బలోపేతానికి, టిపిసిసి అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వాన్ని సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లడానికి రాజ్ కుమార్ కృషి చేయాలని డాక్టర్ రాజీవ్ ఆకాంక్షించారు. ప్రజారోగ్యాన్ని మెరుగుపరచడం, ప్రభుత్వ వైద్య సేవలను ప్రజలకు చేరువ చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించాలని సూచించారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించినందుకు రాజ్ కుమార్ పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

# దృశ్య రూప గణితంతో విద్యార్థులకు ఆసక్తి



ప్రజాపక్షం/ఎడపల్లి:దృశ్య రూపంలో గణితాన్ని నేర్చుకోవడం వల్ల సబ్జెక్టుపై భయం పోయి విద్యార్థులు సులభంగా అవగాహన చేసుకుంటారని ఏఆర్పీ క్యాంప్ హై స్కూల్ హెచ్‌ఎం ఏ. రజిని అన్నారు. శనివారం నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం ఏఆర్పీ క్యాంప్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఘనంగా గణిత మేళాను నిర్వహించారు. ఈ ప్రదర్శనలో ఆరవ తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుకున్న విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గణితంలోని క్లిష్టమైన అంశాలను సైతం సులభంగా అర్థం చేసుకునేలా విద్యార్థులు తయారు చేసిన ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా వివిధ గణిత భావనలకు సంబంధించిన రంగురంగుల చార్టులు 2డి, 3డి ఆకారాల నమూనాలు, జ్యామితి, బీజగణిత సూత్రాలకు సంబంధించిన వర్కింగ్ మోడల్స్‌ను విద్యార్థులు ప్రదర్శించారు. ఈ మేరకు స్కూల్ హెచ్‌ఎం రజిని మాట్లాడుతూ... గణితం అనేది అమూర్తమైనదని, దానిని విద్యార్థులకు అర్థమయ్యేలా మూర్తవంతంగా మార్చడానికి ఇలాంటి నమూనాలు, చార్టులు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. విద్యార్థులను ప్రోత్సహించి, ఈ మేళాను విజయవంతంగా నిర్వహించినందుకు గణిత ఉపాధ్యాయులు ఎం.సాయిలును హెచ్‌ఎం, తోటి ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు. అలాగే జాన్కంపేట్ గ్రామంలోని జడ్పీహెచ్‌ఎస్ లో మండల స్థాయి గణిత టాలెంట్ టెస్ట్ ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## గజగజ వణికిస్తున్న చలి

ప్రజాపక్షం / తిర్యాణి:కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాను చలి వణికిస్తోంది. ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పడిపోవడంతో జిల్లా వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రంలోనే అత్యల్ప ఉష్ణోగ్రతలు ఈ జిల్లాలో నమోదవుతున్నాయి. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో చలి తీవ్రత అధికంగా ఉండటంతో వాతావరణ శాఖ జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. జిల్లాలోని తిర్యాణి మండలం గిన్నెదారి, సిర్పూర్ యు, లింగాపూర్ ప్రాంతాల్లో 5.7 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వీస్తున్న శీతల గాలుల ప్రభావంతో జిల్లా ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం 10 గంటలైనా జనం బయటకు రావడానికి జంకుతున్నారు. చలి తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో చిన్నపిల్లలు, వృద్ధులు వ్యాధిగ్రస్తులు తగిన జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. ముఖ్యంగా శ్వాసకోశ సమస్యలు ఉన్నవారు అప్రమత్తంగా ఉండాలని కోరుతున్నారు. ప్రజలు వెచ్చని దుస్తులు ధరించాలని రాత్రి సమయాల్లో బయట తిరగడం తగ్గించుకోవాలని సూచించారు.

## ఇందనపల్లిలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాపక్షం/ జన్నారం:జన్నారం మండలంలోని ఇందనపల్లి గ్రామంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జన్నారం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ ఉమశ్రీ ఆధ్వర్యంలో ఈ శిబిరం జరిగింది. జిల్లా క్షయ వ్యాధి నివారణా విభాగం అధికారి డాక్టర్ సుధాకర్ నాయక్ ఆదేశాల మేరకు ప్రధాన మంత్రి క్షయ ముక్త్ భారత్ అభియాన్ లో భాగంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. క్షయ నివారణ కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని ఈ సందర్భంగా డాక్టర్ ఉమశ్రీ పేర్కొన్నారు. ఈ శిబిరంలో 100 మందికి ఎక్స్రే పరీక్షలు, 35 మందికి కఫం పరీక్షలు నిర్వహించారు. అలాగే 62 మందికి హెచ్ఐవి, 62 మందికి సిఫిలిస్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేశారు. కార్యక్రమంలో బి. సురేష్ ఎస్ టి ఎస్, ఆంజనేయులు హెచ్ఐవి కౌన్సిలర్, లక్ష్మి హెచ్ఎస్, పూజ ఎంఎల్‌హెచ్‌పి, వసంత, పోచయ్య, గ్రామ సర్పంచ్ పాల్గొన్నారు.

## స్మార్ట్ యాప్ ద్వారా యూరియా బుకింగ్

### మండల వ్యవసాయ అధికారి అంజిత్ కుమార్

ప్రజాపక్షం/ జన్నారం :రైతులు తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫెర్టిలైజర్ స్మార్ట్ యాప్ ద్వారానే యూరియాను బుక్ చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి అంజిత్ కుమార్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ రైతులు తమ మొబైల్ ఫోన్లలో గూగుల్ ప్లే స్టోర్ నుండి ఈ యాప్‌ను డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. రైతు భరోసాకు అనుసంధానమైన మొబైల్ నెంబర్‌తో లాగిన్ అయ్యి, ఓటిపి వెరిఫికేషన్ పూర్తి చేయాలని వివరించారు. పట్టాదారు పాస్ బుక్ నెంబర్, సాగు చేస్తున్న పంట, విస్తీర్ణం వివరాలు నమోదు చేస్తే అవసరమైన యూరియా బ్యాగుల సంఖ్య యాప్‌లో కనిపిస్తుందని తెలిపారు. అనంతరం మండలంలోని డీలర్ షాపును ఎంపిక చేసుకుని బుకింగ్ చేసుకోవాలని, బుక్ చేసిన 24 గంటల లోపు ఎరువులను తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం యూరియా మాత్రమే యాప్‌లో అందుబాటులో ఉందని, డిఏపి, కాంప్లెక్స్ ఎరువులు పాత విధానంలోనే లభిస్తాయని పేర్కొన్నారు. ఏవైనా సందేహాలు ఉంటే వ్యవసాయ అధికారులను సంప్రదించాలని ఆయన కోరారు.

## రాజుర ఎంపిపిఎస్ పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహణ




ప్రజాపక్షం/లోకేశ్వరం:రాజుర ఎంపిపిఎస్ పాఠశాలలో పోషకుల టీచర్ల సమావేశం జరిగింది.పోషకారోత్సవం సందర్భంగా హెడ్మాస్టర్ జల్ల రాజేశ్వర్ అతిథులకు స్వాగతం పలికి పాఠశాల పనితీరు గూర్చి పరీక్షల నిర్వహణ గురించి తెలిపారు.పాఠశాల పిటిఎం సమావేశానికి పరిశీలకులుగా విచ్చేసి నటువంటి జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ పాఠశాల పనితీరును ప్రశంసించారు.జిసిడిఓఅధికారి రమాదేవి పాఠశాల పట్ల పనితీరు సదుపాయాల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.అనంతరం ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని సందర్శించారు.ఫుడ్ స్టాల్ లో 18 రకాల పోషకాహార పదార్థాలు విద్యార్థులు ప్రదర్శించి అమ్మేశారు అమ్మిన తర్వాత వచ్చిన డబ్బులు పేద విద్యార్థుల కోరకు డబ్బుని వినియోగిస్తామని హెచ్ఎం కు తెలిపారు.ఈ కార్యక్రమంలో విడిసి చైర్మన్ ముత్త గౌడ్ సర్పంచ్ శ్యామల ఎవి పిసి చైర్మన్ సరస్వతి,ఉప సర్పంచ్ సురేష్ పోషకులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మున్సిపల్ అధికారుల స్పెషల్ డ్రైవ్

**ప్రజాపక్షం/బోధన్:**బోధన్ పట్టణం మున్సిపల్ పరిధిలోని పెండింగ్‌లో ఉన్న బకాయిలను వసూలు చేయడానికి మున్సిపల్ కమీషనర్ యాదవ్ కృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టారు. శనివారం బోధన్ పట్టణంలోని ఒకటవ వార్డులో ఇంటింటికి తిరుగుతూ ఇంటి పన్ను, నీటి పన్నులు వసూలు చేశారు. పెండింగ్ బకాయిలు రెండు లక్షల పదివేల రూపాయాలు వసూలు చేయడం జరిగిందని మున్సిపల్ అధికారులు సిబ్బంది, వార్డు ఆఫీసర్, మెప్మా, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

## అబాకస్ జిల్లా ఫస్ట్ మల్కాపురం వైష్విన్

**ప్రజాపక్షం/నిజామాబాద్ :**జిల్లాలో జరిగి అబాకస్ పోటీల్లో నగరానికి చెందిన మల్కాపురం వైశ్విన్ జిల్లా ఫస్ట్ ర్యాంకు సాధించాడు. ఈ పోటీల్లో జిల్లాలోని 16 ప్రైవేట్ స్కూల్స్ విద్యార్థులు పోటీ పడగా టైం కిడ్స్ స్కూల్ విద్యార్థులు కూడా ఇందులో పాల్గొన్నారు. టైం కిడ్స్‌లో 6వ తరగతి చదువుతున్న వైశ్విన్ జిల్లాలోనే మొదటి స్థానంలో నిలిచాడు. దీంతో జిల్లాలోని ప్రైవేట్ స్కూల్స్, టైం కిడ్స్ యాజమాన్యం అభినందనలు తెలిపారు. ఇక అబాకస్ జిల్లా లెవల్ పోటీలు నిర్వహించిన కాంపిటేషన్ ఒక అబాకస్‌లోని ఒక సమస్యను 5 నిమిషాలు సమయమిస్తే 3.54 సెకండ్‌సలో పూర్తి చేశాడు. దీంతో విశ్వం ఎడ్యుకేట్ వారు ప్రశంసపత్రం ఫస్ట్‌ప్రైజ్ శీల్డ్‌ను అందజేశారు.

## కండువా కప్పి ఆహ్వానం

**ప్రజాపక్షం/భీమ్‌గల్:**మండలంలోని మేజర్ గ్రామపంచాయతీకి స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికై కోళ్ల నర్సయ్య శనివారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఆయనతో పాటు పలువురు వార్డు సభ్యులు 300 మ ంది పార్టీలో చేరారు. వారందరిని పార్టీలోకి ఆహ్వానిస్తూ ప్రశాంత్‌రెడ్డి మాట్లాడారు. అధికారంలో లేకున్నా స్వతంత్ర సర్పంచ్‌తో పాటు 300 మంది బీఆర్ఎస్ పార్టీలో చేరటమంటే అది ఈ కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం పోయిందనడానికి నిదర్శనం. అలాగే కేసీఆర్ మీద ఉన్న నమ్మకం ఏనాటికైనా తెలంగాణకు కేసీఆర్ మాత్రమే శ్రీరామ రక్ష అని ప్రజలు నమ్ముతున్నారు.

## అచ్చంపేట్‌లో పేరెంట్స్ టీచర్స్ సమావేశం

**ప్రజాపక్షం/నిజాంసాగర్:**జాంసాగర్ మండలంలోని అచ్చంపేట్ కాంప్లెక్స్ పరిధిలోని అచ్చంపేట్ ప్రాథమిక పాఠశాలలో శనివారం పేరెంట్స్ టీచర్స్ సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ముఖ్య అతిథిగా కాంప్లెక్స్ హెచ్ఎం వెంకట్‌రాంరెడ్డి పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లాల్‌సింగ్ మాట్లాడుతూ పాఠశాల ప్రగతికి పిల్లల తల్లితండ్రులు తోడ్పాటునందించాలని, పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల ప్రగతిని వివరించారు. ఇప్పటి వరకు పాఠశాల అభివృద్ధికి కృషిచేసిన దాతలకు అభినందనలు తెలియజేశారు. తరగతి గదుల నిర్మాణాలు చేపట్టిన మనకోసం మనం అనే స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు కిషోర్‌కుమార్ అందించిన విరాళాల గురించి తలతల్లితండ్రులకు తెలియజేశారు. కాంప్లెక్స్ హెచ్ఎం వెంకట్‌రాం రెడ్డి పాఠశాల అభివృద్ధికి కృషిచేసిన వారిని గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీలు బి.శ్రీధర్‌కుమార్, ఎం.వరలక్ష్మీ, పాఠశాల ఉపాధ్యాయులు సాయిప్రసాద్, మౌనిక, సుష్మ, విద్యార్థులు, వారి తల్లితండ్రులు పాల్గొన్నారు.

## పాలకవర్గాలు మారినా.. పట్టణ అభివృద్ధి శూన్యం

**ప్రజాపక్షం/ఖానాపూర్:**గడిచిన ఏడు సంవత్సరాల్లో ఎలాంటి అభివృద్ధి జరగలేదు పట్టణంలో కనీస సౌకర్యాలు కూడా లేవు,గత కొన్ని రోజుల క్రితం పట్టణానికి 15 కోట్ల రూపాయలు మంజూరు చేశామని,కాంగ్రెస్ నాయకులు అంటున్నారు.అవి పేపర్ల వరకే పరిమితం అయి పోయాయి అని బిజెపి నాయకులు ఆరోపించారు.బుధవారం ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్ కి వినతి పత్రం అందజేశారు.సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంతవరకు కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసి నిధులు మున్సిపాలిటి అకౌంట్లో జమ కాలేవు,అలాగే ఇక్కడ ఎన్నుకున్న స్థానిక నాయకులు ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీ కండువాలు కప్పుకుంటూ పట్టణ అభివృద్ధిని గాలికి వదిలేసారని,ఇప్పటి వరకు పట్టణంలో రెండు పాలకవర్గాలు మారిన అభివృద్ధి శూన్యం కాగా పన్నుల మోతతో ప్రజలను ఇక్కట్లకు గురిచేస్తూ పేదల ఇళ్లకు తాళాలు వేస్తామని,బెదిరిస్తూ పన్నులు వసులు చేస్తున్నారు.పట్టణంలోని ప్రజలే కోతులు ఎలా తరిమికొట్టాలని చెప్పి కమిటీలు వేసుకొని పని చేస్తున్నారే తప్ప అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు.పట్టణంలోని వార్డులలో అధికారుల పర్యవేక్షణ శూన్యం నాలాల వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని బిజెపి నాయకులు ఆరోపించారు.రాష్ట్ర నాయకులు ఆకుల శ్రీనివాస్,అసెంబ్లీ కన్వీనర్ అంకం మహేందర్,జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్ రెడ్డి,పట్టణ అధ్యక్షుడు కీర్తి మనోజ్,మండల అధ్యక్షుడు పుప్పాల ఉపేందర్,పట్టణ ఉపాధ్యక్షుడు జెట్టిసురేందర్,మాదాసు మురళి,అసం సాయి,సీనియర్ నాయకులు పిట్టల భూమన్న,పోల్సాని అనిల్ రావు,సందుపట్ల శ్రవణ్,రాపెల్లి రవీందర్ గోడపురం సందీప్,అడిదెల మహేష్,కాలేరి రాజేందర్,మేకల నరసయ్య,రెండ్ల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛభారత్ పితా మహుడి 69వ వర్ధంతి



**ప్రజాపక్షం/బైంసా:**బైంసా పట్టణంలోని సంతోషి మాత ఏరియాలో స్వచ్ఛభారత్ పితా మహుడు సంత్ గాడ్ గే బాబా యొక్క 69వ వర్ధంతిని పురస్కరించుకోని బాబా చిత్ర పటానికి సంత్ గాడ్ గే బాబా అవార్డ్ గ్రహీత సుంకేట పోశెట్టి ఆధ్వర్యంలో పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.సందర్భంగా సుంకేట పోశెట్టి మాట్లాడుతూ,మనసులోని మలినాన్ని శుభ్రపరచి సమాజంలో ఉన్న నిచ్చెన మెట్ల కుల వ్యవస్థతో పాటు,మూఢ నమ్మకాలు,అవిద్య నుండి పేద ప్రజలకు విముక్తి కలిగించేందుకు తన కీర్తనల ద్వారా యావత్ సమాజాన్ని జ్ఞానోదయం వైపు నడవాలని బాబా బోధించే వారు,అంతె కాకతనభక్త బృందం ద్వారా ఇచ్చే కానుకలను,నిరుపేద ప్రజల కోసం ధర్మ శాలలు,పాఠశాలలు,హాస్పత్రులు నిర్మాణం చేసి పేద ప్రజలకే అంకితం చేశారు.బాబా చేసిన సేవలను గుర్తించిన మహా రాష్ట్ర ప్రభుత్వం బాబా పేరు మీద యావత్ మాల్ జిల్లాలో విశ్వ విద్యాలయానికి,సంత్ గాడ్ గే బాబా పేరు పెట్టారు.ఆనాటి కాలంలో అంటరానితనం కొనసాగుతుంటే,దీన్ని నివారించటానికి,దళితుల కోసం చౌక మేళ పేరుతో పెద్ద ధర్మ శాలను నిర్మించి,డా.బాబా సాహెబ్ అంబేద్కర్ కి అంకితం చేశారు.ఇలాంటి సేవలను ఆదర్శంగా తీసుకొని డా.బాబా సాహెబ్ అంబేద్కర్ గాడ్ గే బాబాను గురువుగా ప్రకటించుకొన్నారు.మహా రాష్ట్ర ప్రభుత్వం బాబా జయంతి,వర్ధంతి లను అధికారికంగా నిర్వహిస్తుంది.అదె విధంగా బాబా చేసిన సేవలను గుర్తించి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు వీరి జయంతి,వర్ధంతి లను అధికారికంగా నిర్వహించి,వీరి చరిత్రను పాఠ్యాంశంలో చేర్చి,గాడ్ గే బాబాకి భారతరత్న ఇవ్వాలి అని పోశెట్టి కేంద్ర ప్రభుత్వంను కోరారు.ఈ కార్యక్రమంలో,బిజెపి రాష్ట్ర ఓబిసి నాయకులు బోస్లే బాజీరావ్‌పటేల్,నూతనంగ ఎన్నికైన బామ్ ని సర్పంచ్ డి.బాలాజీ, మెంబర్స్,యోగెస్ పటేల్,బొంగ్రాం పటేల్,మాధవ్ పటేల్,బిసి నాయకులు నందు,పిరాజి తదితరులు పాల్గొన్నారు.

## కనీస వేతనాలు చెల్లించని అధికారుల సస్పెన్షన్



**ప్రజాపక్షం/బైంసా:** బైంసా పట్టణంలోని మున్సిపాలిటిలో గత రెండు రోజులుగా తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ మల్టిపర్పస్ కార్మికులు ధర్నా చేస్తున్నారు.వీరికి మద్దతుగా జనసేన పార్టీ నిర్మల్ జిల్లా నాయకులు సుంకేట మహేష్ బాబు హాజరై మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగ వివిధ విభాగల్లో కాయ కష్టం చేస్తున్న అభాగ్య జీవుల పరిస్థితి చాలా ఘోరంగా తయారైంది.వీరికి కనీస వేతనం జిఓ ప్రకారం చెల్లించకుండా కేవలం పదివేలు మాత్రమే జీతం ఇస్తూ చేతులు దులుపుకుంటున్నారు.మిగితా జిల్లా లోని మున్సిపాలిటీలో ఇస్తున్న దానితోడు పిఎఫ్ పేరిట కొన్ని సంవత్సరాలనుండి అస్సలు డబ్బులు జమ కావడం లేదు.కనీసం మెసేజ్ లు కూడ రాకపోవడం చాలా విడ్డురం.ఇందులో ఏదో అవినీతి జరుగుతుందని వాపోయారు.కార్మికుల శ్రమను దోచుకుంటున్న అధికారులపై సమగ్ర విచారణ జరిపి సబ్ కలెక్టర్ వారిపై చట్ట రీత్యా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా జిఓ ప్రకారం వేతనాలు 5వ తేదీ లోపు సరైన సమయానికి చెల్లించి పిఎఫ్ డబ్బులు క్లియర్ చేసి న్యాయం చేయాలని కోరుతున్నాం.లేని యెడల కార్మికుల పక్షాన అండగా నిలబడి భవిష్యత్ లో జరిగే పోరాటానికి పూర్తి స్థాయి మద్దతూ తెలియచేస్తామని హెచ్చరిస్తున్నాం.దీనికి పూర్తి భాద్యత ప్రభుత్వమే వహించాల్సి వస్తుంది.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు ఆరిఫ్,ప్రకాష్,సలీమ్,విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన బిజెఎల్‌పి నేత



**ప్రజాపక్షం/లక్ష్మ ణ్ చంద:**లక్ష్మణచందా మండలంలోని ధర్మారం గ్రామంలో కోతి దేవుని ఆలయాన్ని బిజెఎల్‌పి నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే ని శాలువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలోబిజెపి సీనియర్ నాయకులు రావుల రాంనాథ్,మండల అధ్యక్షుడు చిన్నయ్య,మాజీ ఎంపిపిఅడ్వాల రమేష్,ముత్యం రెడ్డి,జిల్లా ఉపాధ్యక్షుడు సత్యం చంద్రకాంత్, జమాల్,నాయకులు శ్రీధర్ రెడ్డి,మల్లేష్,శంకర్,పీచర సర్పంచ్ రాజేశ్వర్,ఉప సర్పంచ్ వినీత్,తో పాటు మండల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సులభ బోధనకు ల్యాబ్ ఎంతో ఉపయోగపడుతుంది: డిఇఒ

**ప్రజాపక్షం/బోధన్:**గణిత శాస్త్రాన్ని సులభంగా ఆసక్తికరంగా బోధించేందుకు ల్యాబ్ ఎంతో ఉపయోగపడుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ అన్నారు. బోధన్ పట్టణం ఆజామ్ గంజ్ కాలనీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి శనివారం సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులు స్వయంగా తయారు చేసిన వివిధ గణిత నమోనాలు, బోధన పద్ధతులను విద్యార్థులు ల్యాబ్‌లో ప్రదర్శించిన విధానాన్ని జిల్లా విద్య శాఖ అధికారి అశోక్ తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ల్యాబ్‌ల ద్వారా విద్యార్థుల్లో ఆలోచనా శక్తి విశ్లేషణ సామార్థ్యం పెరుగుతుందన్నారు. గణిత శాస్త్ర ప్రాముఖ్యతను వివరిస్తూ విద్యార్థులకు ఉపయోగకరంగా నేర్చుకునే విధంగా ఉపాధ్యాయులు బోధన చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బోధన్ మండల విద్యాశాఖ అధికారి నాగయ్య, పాఠశాల ఉపాధ్యాయులు చక్రవర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## లీజు లైసెన్స్ వేలం పాట వాయిదా

**ప్రజాపక్షం/బోధన్:**బోధన్ పట్టణంలోని మారుతి మందిరం దుకాణముల సముదాయంలో గల దుకాణం నవంబర్ ఒకటికి రెండు సంవత్సరాల కాల పరిమితికి గాను దేవాదాయ శాఖ అధికారులు లీజు లైసెన్స్ వేలంపాట నిర్వహించారు. శనివారం నిర్వహించిన దుకాణం నంబర్ 1వేలం పాటకు పాటదారులు రాకపోవడంతో వేలం పాటను వాయిదా వేసినట్లు నిజామాబాద్ జిల్లా దేవాదాయ ఇన్‌స్పెక్టర్ కమల, ఆలయ ఈఓ రాములు తెలిపారు. తదుపరి వేలంపాట ప్రకటన త్వరలో ప్రకటించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు ప్రవీణ్ శర్మ, మధు సూదన్, సిబ్బంది సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మండల అధికారులను సన్మానించిన సర్పంచ్



**ప్రజాపక్షం/బోధన్:**నిజామాబాద్ జిల్లా చందూర్ మండల గ్రామ సర్పంచ్‌గా మద్దూరి మాధవ రెడ్డి గెలుపొందిన విషయం తెలిసిందే. నూ తన సర్పంచిగా గెలుపొందిన మాధవ రెడ్డి మండల తహసీల్దార్ తో పాటు ఎంపిడిఒ లను ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం అధికారులను నూతన సర్పంచి మాధవ రెడ్డి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఆయన వెంట స్థానిక నాయకులు ఉన్నారు.

## తిరుప్పావై ప్రవచనాలు



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్:**దేవరకోటలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ధనుర్మాస ఉత్సవాలలో భాగంగా తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో తిరుప్పావై ప్రవచనాల భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి.ఈ సందర్భంగా ప్రవచకులు టి.కే.రామకృష్ణన్ స్వామి మాట్లాడుతూ,భగవత్ అనుగ్రహం ఆచార్య కృప చేతనే సిద్ధిస్తుందని,ఆచార్యుల వాత్సల్యానికి పాత్రులమైతే భగవత్ ప్రాప్తి లభిస్తుందని తెలిపారు.తిరుప్పావైలోని మొదటి ఐదు పాశురాలను 'ముఖ్య దశ' గా పేర్కొంటారని,ఆరవ పాశురం నుంచి పదిహేనవ పాశురం వరకు పూర్వ తిరుప్పావైగా,పదహారవ పాశురం నుంచి ముప్పైవ పాశురం వరకు ఉత్తర తిరుప్పావైగా పిలుస్తారని వివరించారు.మొదటి భాగంలో భాగవతుల భాగస్వామ్య ప్రాధాన్యతను,రెండో భాగంలో భగవత్ అనుగ్రహ ప్రాప్తి మార్గాన్ని ఆండాళ్ తల్లి వివరించిందని చెప్పరు.ఆండాళ్ తల్లి వైభవాన్ని వివరిస్తూ సాగిన ఈ ప్రవచనానికి భక్తులు విశేషంగా స్పందించారు.ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు,భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పేద ప్రజలకు అండగా నిలిచేది ఎర్రజెండా పార్టీ మాత్రమే

రాష్ట్ర సెక్రటేరియల్ సభ్యులు చలపతిరావు

**ప్రజాపక్షం/బోధన్:**దేశంలో అనేక పోరాటాలు నిర్వహించి పేద ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ ఈ నాటికి పేద ప్రజలకు అండగా ఉన్న పార్టీ ఉన్నదంటే ఎర్రజెండా పార్టీయే అని రాష్ట్ర సెక్రటేరియల్ సభ్యులు జెవి చలపతి రావు అన్నారు. వందేళ్ల కమ్యూనిస్టు ఉద్యమ పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తూ శనివారం బోధన్ పట్టణంలో సిపిఐ ఎంఎల్‌న్యూ డెమోక్రసి పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలోని శక్కర్ నగర్ చౌరస్తా నుంచి రాకాసిపేట్ మెహర్బా ఫంక్షన్ హాల్ వరకు వంద మీటర్ల రెడ్ ఫ్లాగ్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పట్టణంలోని మెహర్బా ఫంక్షన్ హాల్లో పార్టీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య అధ్యక్షతన సభను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు జేవీ చలపతి రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..



కమ్యూనిస్టు ఉద్యమంలో అనేక అటుపోట్లు ఉన్నాయని పాయాలు పాయలుగా కమ్యూనిస్టులు చీలినప్పటికీ కమ్యూనిస్టు ఉద్యమంలో వచ్చిన అనేక రకాల ధోరణుల మూలంగా కొంత నష్టం వాటిల్లినప్పటికీ రానున్న రోజుల్లో ప్రజా ఉద్యమంతో విప్లవోద్యమాన్ని నిర్మిస్తామని అన్నారు. పాలకవర్గాలు దోపిడి వర్గాలు పేదల పక్షాన ఎప్పుడు లేవని పేదల కోసం ఎర్రజెండా మత్రమే ఉన్నదని తెలిపారు. దేశంలో పేదవారికి ఉన్న వారికి తారతమ్యాలు పెరిగిపోతున్నాయని సంపద ఒక వర్గం చేతుల్లోనే ఉంటుందని, పేదవారు మరింత పేదవారిగా మారిపోతున్నారని పేర్కొన్నారు. దోపిడి రహిత సమాజం కోసం సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసి కృషి చేస్తుందని అన్నారు. దేశంలో భూ సమస్యలపైన, కుల సమస్యల పైన కార్మిక హక్కుల కోసం రైతాంగ సమస్యల పైన పోరాడాలని వందేళ్ల కమ్యూనిస్టు ఉద్యమ వారసత్వాన్ని ఉద్యమ స్ఫూర్తిని కొనసాగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు వేల్పూరు భూమయ్య, గౌతమ్ కుమార్, న్యాయవాది పరుచూరి శ్రీధర్, జిల్లా కమిటీ సభ్యులు రమేష్, సభ్యులు నీలం సాయిబాబా, పరువయ్య పోశెట్టి, అరుణ భారతి సాయిరెడ్డి, బాలయ్య, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా ఉద్యోగ ఉపాధ్యాయులకు పదేళ్లుగా అవార్డులు



**ప్రజాపక్షం/నిజామాబాద్ :**మహిళా ఉద్యోగ ఉపాధ్యాయునులకు పదేళ్లుగా అవార్డులు ఇవ్వటం అభినందనీయమని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. శనివారం నగరంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో బిసిఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో జనవరి 10న నిర్వహించే సావిత్రిబాఇ పూలే పురస్కారాల కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. దేశంలో మొదటి మహిళా ఉపాధ్యాయులైన సావిత్రిబాయి పూలే పేరిట అవార్డును స్థాపించి మహిళా ఉద్యోగ ఉపాధ్యాయినులను 10 సంవత్సరాలుగా అవార్డును ఇవ్వటం అభినందనీయమన్నారు.కార్యక్రమంలో మాడవేడి వినోద్‌కుమార్, రామకృష్ణ, రాజు, మోహన్, రమణ స్వామి, సంజీవ్ పాల్గొన్నారు.

# గణితమే జీవిత గమనం

**ప్రజాపక్షం/కమ్మర్‌పల్లి:**విద్యార్థుల్లో చాలా మందికి గణితమంటే ఒక భయంటుందని దానిని అధిగమిస్తే మంచి ఫలితాలు పొందవచ్చని ఎంఈఓ ఆంధ్రయ్య అన్నారు. రామానుజన్ జయంతిని పురస్కరించుకుని కమ్మర్‌పల్లి ఎంఆర్‌పిఎస్‌లో గణితం గొప్పతనాన్ని వివరించారు. గణిత సబ్జెక్టులో పూర్తిస్థాయి పట్టు సాధిస్తే అన్ని అంశాలను ముందంజలో ఉండవచ్చని స్పష్టం చేశారు. 10వ తరగతి పరీక్షలు త్వరలో జరగనున్న నేపథ్యంలో ప్రణాళికబద్ధంగా ముందడుగు వేయాలని మంచి ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. తెలంగాణ గణితపురం రాష్ట్ర సలహాదారులు కోనాపూర్ ప్రధానోపాధ్యాయులు చౌడరపు రాం ప్రసాద్ విద్యార్థులకు గణిత ఫార్ములాలు అందజేశారు. మండల స్థాయిలో ఆంగ్ల మాధ్యమంలో పిఎంశ్రీ జడ్పీహెచ్‌ఎస్ చౌట్‌పల్లి విద్యార్థులు ప్రణవి, మధుప్రియ, ప్రణవి, సోమిత్‌లు వరుసగా మూడు స్థానాలు సాధించి జిల్లాకు ఎంపికయ్యారని తెలుగు మాధ్యమంలో లిఖిత, రచిత, గంగాదేవిలు మూడుస్థానాలు సాధించి జిల్లాకు ఎంపిక కావటంతో విజేతలకు బహుమతులు అందజేశామన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మంచి ఆహారపు అలవాట్లు అలవర్చుకోవాలి

**ప్రజాపక్షం/మోర్తాడ్:**విద్యార్థులు మంచి ఆహారపు అలవాట్లు అలవర్చుకోవాలని మోర్తాడ్ మండలం పాలెం హై స్కూల్ హెచ్ఎం వేణుగోపాల్ అన్నారు. శనివారం నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలం పాలెం గ్రామ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులు ఫుడ్ పెస్టివల్‌ను నిర్వహించారు. అనంతరం తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ మేరకు వేణు గోపాల్ మాట్లాడుతూ.. ఫుడ్ ఫెస్టివల్లో భాగంగా విద్యార్థులు రకరకాల ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలు తయారు చేసుకొని రావడం జరిగిందన్నారు. పోషకాహార పదార్థాలు తినడం వల్ల కలిగే లాభాలను విద్యార్థులకు వివరించామని చెప్పారు. విద్యార్థులు మంచి ఆహారపు అలవాట్లను అలవర్చుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉండి చదువుల్లో క్రీడల్లో రాణించవచ్చని వారికి వివరించారు. ఫుడ్ పెస్టివల్‌లో ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలు జొన్న రొట్టెలు, ఆకు కూరలు, బొబ్బర్ల గుగ్గిల్లు, బొబ్బట్లు, శనగ గుగిల్లు తదితర పదార్థాలను తయారు చేసిన విద్యార్థులను హెచ్ఎం వేణు గోపాల్ రావు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం మహేష్ కుమార్, చంద్రశేఖర్, నరసింహస్వామి, రాజేందర్, జయశ్రీ, త్రివేణి, మమతా, రాజేశ్వరి, ఎన్ .త్రివేణి, సైఫ్, అలీ, నచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.



# బోర్గంలో బిజెపి ఆత్మీయ సమ్మేళనం

**ప్రజాపక్షం/ఎడపల్లి:**నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం బోర్గం గ్రామంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఇటీవల నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి మద్దతుతో గెలుపొందిన అలాగే పోటీ చేసిన సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు వార్డు సభ్యులను గౌరవించుకునే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డీ మోహన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డిల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులను పార్టీ నాయకులు శాలువాలతో సత్కరించి, చిరు సన్మానం చేశారు. ఈ సందర్భంగా వడ్డీ మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడంలో సర్పంచ్‌లు, వార్డు సభ్యుల పాత్ర కీలకమని కొనియాడారు. ప్రజల పక్షాన నిలబడి పోరాడే కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రాబోయే రోజుల్లో ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎన్నికల ఇన్‌చార్జి కూరెళ్ల శ్రీధర్, జనరల్ సెక్రెటరీ ప్రసాద్, నాయకులు ఈర్ల రాజు, మేక సంతోష్, సుక్కరాజు, గోపి కృష్ణ, అజయ్, లక్ష్మ ణ్ తదితరులు హాజరయ్యారు.



# యూరియా బుకింగ్ యాప్‌పై అవగాహన

**ప్రజాపక్షం/ఎడపల్లి:**రైతులు ఎరువుల కొనుగోలులో ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ప్రభుత్వం ప్రవేశ పెట్టిన యూరియా బుకింగ్ యాప్‌పై శనివారం ఎడపల్లి మండలంలోని జాన్కంపేట్ గ్రామ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎవో సిద్ది రామేశ్వర్ రైతులకు యాప్ పనితీరుపై వివరించారు. యాప్ ద్వారా యూరియా బుక్ చేసుకోవడం వల్ల ఎరువుల పంపిణీలో పారదర్శకత పెరుగుతుందని, బ్లాక్ మార్కెట్‌కు అడ్డుకట్ట వేయవచ్చని ఎఓ తెలిపారు. రైతులు తమ మొబైల్ ద్వారానే ముందస్తుగా యూరియాను బుక్ చేసుకోవచ్చని, దీని వల్ల సొసైటీల వద్ద గంటల తరబడి వేచి ఉండాల్సిన అవసరం ఉండదని పేర్కొన్నారు. ఈ యాప్ ద్వారా ఏఏ కేంద్రాల్లో ఎంత యూ రియా స్టాక్ ఉందో రైతులు సులభంగా తెలుసుకోవచ్చని ఆయన వివరించారు. సాంకేతికతను అందిపుచ్చుకోవడం ద్వారా రైతులు సమయాన్ని, డబ్బును ఆదా చేసుకోవచ్చని ప్రతి రైతు ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని, డిజిటల్ పద్ధతిలో ఎరువులను పొందేలా చొరవ చూపాలని సిద్దిరామేశ్వర్ తెలిపారు. ఈకార్యక్రమంలో సహకార సంఘం సిబ్బంది, రైతులు, వ్యవసాయ శాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.



# చిత్రలేఖన పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం

**ప్రజాపక్షం/మోర్తాడ్:**నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలోని బాలికల ప్రాథమిక పాఠశాలలో ఇటీవల నిర్వహించిన చిత్రలేఖన పోటీలలో విజయం సాధించిన విద్యార్థులకు మోడల్స్ అందచేయడం జరిగింది. రంగోత్సవ్, సెలబ్రేషన్స్ వారు నిర్వహించిన చిత్రలేఖన పోటీలలో పాఠశాల నుంచి 57మంది విద్యార్థులు పాల్గొనగా, 20మంది విద్యార్థులు మోడల్స్ పొందడం జరిగింది. మిగిలిన విద్యార్థులకు సర్టిఫికెట్ ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలరాజు, ఉపాధ్యాయులు నరసింహమూర్తి, సాగర్, రమణ చారి, జ్యోతి, ఆర్ట్స్ టీచర్ రాము, తల్లిదండ్రులు జమాల్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# మండల స్థాయి నిర్వహించిన గణిత ప్రతిభ పరీక్ష

**ప్రజాపక్షం/మోర్తాడ్:**మోర్తాడ్ మండలంలోని ఎమ్మార్పీలో శనివారం తెలంగాణ గణిత ఫోరం ఆధ్వర్యంలో మండల స్థాయి గణిత ప్రతిభ పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ సమ్మిరెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ గణిత ఫోరం ఆధ్వర్యంలో ప్రతిభ పరీక్షలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ ప్రతిభ పరీక్షలో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులు, పాఠశాలకు ముగ్గురు చొప్పున పాల్గొన్నారన్నారు. ఈ పరీక్షలో మొదటి విజేత కె.వర్నిత్, జడ్పీహెచ్ఎస్ సుంకెట్, రెండో విజేత పి.రఘురాం, జడ్పీహెచ్ఎస్ శెట్పల్లి, మూడో విజేతలుగా బి.గౌతమి, జడ్‌పీహెచ్ఎస్ పాలెం కె.అక్షర, పి.నవ్య శ్రీ, జడ్పీహెచ్ఎస్‌శెట్పల్లిలు గెలుపొందారన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఆలయానికి ఎలక్ట్రానిక్ హారతి వితరణ

**ప్రజాపక్షం/ఎడపల్లి:**నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం జాన్కంపేట్ గ్రామ శివారులో ఉన్న పవిత్ర పుణ్యక్షేత్రం శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానాన్ని శనివారం బోధన్ ఫస్ట్ అడిషనల్ జడ్జి సాయి శివ సందర్శించారు. ఈ సందర్భంగా వారు ఆలయానికి ఎలక్ట్రానిక్ హారతి డ్రమ్ సెట్‌ను బహుకరించారు. ఆలయానికి వచ్చేసిన జడ్జికి అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. స్వామి వారికి జడ్జి పేరున ప్రత్యేక అర్చనలు, పూజలు నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల మధ్య వారికి తీర్థ ప్రసాదాలు అందచేశారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం జడ్జిని శేష వస్త్రంతో కప్పి ఘనంగా సన్మానించారు. దేవాలయంలో నిత్యం హారతి సమయంలో మంగళ వాయిద్యాలు మారుమోగాలనే ఉద్దేశ్యంతో ఈ ఎలక్ట్రానిక్ హారతి డ్రమ్ ను అందించినందుకు ఆలయ సిబ్బంది జడ్జి సాయి శివ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు సిబ్బంది పాల్గొన్నారు.

# ఆహారపు అలవాట్లపై అవగాహన పెంచేందుకే ఫుడ్ పెస్టివల్




**ప్రజాపక్షం/ఎడపల్లి:**విద్యార్థులకు చదువుతో పాటు ఆహారపు అలవాట్లపై అవగాహన పెంచేందుకే ఫుడ్ పెస్టివల్ నిర్వహిస్తున్నామని పలువురు ప్రధానోపాధ్యాయులు అన్నారు. ఎడపల్లి మండలంలోని పలు గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఫుడ్ పెస్టివల్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తాము ఇంటి నుంచి వండి తెచ్చిన పలు రకాల వంటలను ప్రదర్శించి, ఉపాధ్యాయులకు వడ్డించారు. ఈ సందర్భంగా పలువురు ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పోషకాహారంపై అవగాహన కల్పించడానికి వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి ఫుడ్ పెస్టివల్ ఒక అద్భుతమైన వేదిక అని వారు తెలిపారు. విద్యార్థులకు జంక్ ఫుడ్ వల్ల కలిగే నష్టాలను ఏ ఆహారంలో ఏ విటమిన్లు ఉంటాయో విద్యార్థులకు వారు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ పై రైతుల్లో విస్తృత అవగాహన



**ప్రజాపక్షం/నిర్మల్:**ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ వినియోగంపై వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు.శనివారం సాయంత్రం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో రాష్ట్ర ప్రభుత్వం అందుబాతటులోకి తెచ్చిన యూరియా యాప్ వినియోగంపై అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,రైతులు సులభంగా యూరియా పొందాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం యూరియా బుకింగ్ యాప్ అందుబాటులోకి తీసుకువచ్చిందని తెలిపారు.జిల్లాలో ప్రతి రైతుకు ఈ యాప్ పై ఖచ్చితంగా అవగాహన కల్పించాలని తెలిపారు.ఈ యాప్ ద్వారా రైతులు సులభంగా తమకు కావల్సిన యూరియా పొందగలుగుతారని అన్నారు.యాప్ వాడకంలో రైతులకు సహాయపడాలని చెప్పారు.ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు.ఈ యాప్ ద్వారా యూరియా ఎక్కడ,ఎంత మొత్తంలో అందుబాటులో ఉందో సులభంగా తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.యూరియా,ఎరువుల వాడకం పై రైతులకు వ్యవసాయ అధికారులు ఎప్పటికప్పుడు సూచనలు ఇస్తూ ఉండాలని తెలిపారు.వారు సాగు చేస్తున్న పంట,విస్తీర్ణం ను బట్టి మాత్రమే రైతులు యూరియా వినియోగించేలా వారిని ప్రోత్సహించాలని అన్నారు. అధిక మోతాదులో యూరియా వల్ల కలిగే నష్టాలను వారికి వివరించాలని తెలిపారు.యూరియా వినియోగం శాస్త్రీయంగా ఉండాలని తెలిపారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ,జిల్లాలో అయిల్ పామ్ పంట సాగు విస్తీర్ణం పెంచేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అయిల్ ఫామ్ పంటల సాగు వల్ల పొందే ఆర్థిక లాభాలను రైతులకు వివరించి,పెద్ద మొత్తంలో రైతులు ఆయిల్ ఫామ్ పంటలు సాగు చేసేలా వారిని ప్రోత్సహించాలని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్,ఉద్యానవన పంటల అధికారి రమణ,డిఎస్ఓ నర్సయ్య,ఇతర అధికారులు,సిబ్బం ది పాల్గొన్నారు.

## అలరించిన బిర్లా భోమిస్ కార్నివాల్

**ప్రజాపక్షం/కరీంనగర్:**కరీంనగర్ భోమ్మకల్ బిర్లా ఓపెన్ మైండ్ఎస్ పాఠశాలలో శనివారం రాత్రి జరిగిన భోమిస్ కార్నివాల్ వార్షికోత్సవ వేడుకలు జోరుగా హుషారుగ జరిగాయి. చిన్నారులు సాంస్కృతిక ప్రదర్శనలతో హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో క్రింది విద్యాసంస్థల చైర్మన్ దాసరి మనోహర్ రెడ్డి, డైరెక్టర్ ప్రశాంత్ రెడ్డి, ప్రిన్సిపల్స్ తదితరులు పాల్గొన్నారు.

## శాతవాహన వృక్షశాస్త్ర విద్యార్థుల క్షేత్ర పర్యటన



**ప్రజాపక్షం/కరీంనగర్:**శాతవాహన విశ్వ విద్యాలయంలో వృక్షశాస్త్ర విద్యార్థిని విద్యార్థులు శైవలాల సేకరణలో భాగంగా దిగువ మానేరు డ్యామ్ ను వృక్షశాస్త్ర విభాగధిపతి డా.సాయిని కిరణ్ ఆధ్వర్యంలో సందర్శించడం జరిగింది. ఇందులో భాగంగా శైవలాల సేకరణ ఏ విధంగా చేయాలి, ఏ విధంగా భద్రపరచాలి, వాటి యొక్క ఆర్థిక ప్రాముఖ్యతను తెలియజేస్తూ క్షేత్ర పర్యటన లక్ష్యాలను విద్యార్థులకు తెలియజేయడం జరిగింది. అధ్యాపకులు డా. అభినేష్, డా॥ శివకుమార్ శైవలాల ఆవశ్యకతను వివరించడం జరిగింది. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డా॥ రమాకాంత్ మాట్లాడుతూ, విద్యార్థులు తరగతి గదిలోనే కాకుండా క్షేత్ర పర్యటన చేసినప్పుడే ఆచరణాత్మక జ్ఞాన సమూపార్జన, వాస్తవిక అనుభవాలను నేర్చుకోవచ్చని తెలియజేసారు. వృక్ష శాస్ర విద్యార్థిని విద్యార్థులుఉత్సాహంగా క్షేత్ర పర్యటనలో పాల్గొన్నారు.

## మండల స్థాయి గణిత ప్రతిభ పోటీలు



**ముత్తారం/ప్రజాపక్షం :** జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు తెలంగాణ గణిత ఫోరం పెద్దపల్లి జిల్లా విభాగం సూచనల మేరకు శనివారం మంథనిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలికలు) మండల స్థాయి గణిత ప్రతిభ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో మంథని మండలంలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలకు చెందిన 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. గణిత ప్రతిభా పాటవ పోటీకి ఆంగ్ల మాధ్యమం నుండి 14 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మొదటి బహుమతి ఎన్. పరమేష్, రెండవ బహుమతి ఎం. జోష్ణ జిల్లా పరిషత్ గర్ల్స్ హై స్కూల్ మంథని, తృతీయ బహుమతి ఎన్. ధనుష్ జెడ్ పి హెచ్ ఎస్ బాయ్స్ మంథని, రెసిడెన్షియల్ విభాగంలో ప్రథమ బహుమతి కె.సాయి వినయ్ తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ బాయ్స్ మంథని, రెండవ బహుమతి ఈ. శ్రీ వల్లి తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ గర్ల్స్ మంథని, తృతీయ బహుమతి ఆర్. విశాల్ తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ బాయ్స్ మంథని విద్యార్థులు గెలుపొందగా వీరు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పోటీలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు మెడల్స్, ప్రశంశా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి ఎస్ సుమలత, వివిధ పాఠశాల గణిత ఉపాధ్యాయులు, టిఎంఎఫ్ మండల శాఖ బాధ్యులు ఎన్. పరంజ్యోతి, ఎస్.శ్రీనివాస్ పరిశీలకులుగా శ్రీ జి.భరత్ రెడ్డి లు పాల్గొన్నారు.

## ముత్తారం ఎంపిడిఒ లలిత సస్పెన్షన్

**ప్రజాపక్షం/ముత్తారం :** ముత్తారం ఎంపిడిఓ, ప్రస్తుతం పెద్దపల్లి జిల్లా గ్రామీణాభివృద్ధి అథారిటీ లో ఏ.పీ.డీ గా డిప్యూటేషన్ పై విధులు నిర్వహిస్తున్న జి.లలిత ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.కమాన్ పూర్ మండలం రొంపికుంట గ్రామంలో పంచాయతీ కార్యదర్శిగా గతంలో పనిచేసిన ఎం.తిరుపతి అవినీతి కారణంగా సర్వీస్ నుంచి తొలగించడం జరిగింది. ఎం తిరుపతి విచారణ సమయంలో అప్పటి కమాన్ పూర్ ఎంపీడీఓ గా విధులు నిర్వహించిన జి.లలిత కు అవినీతి డబ్బులు వాటా పంపినట్లు మాజీ పంచాయతీ కార్యదర్శి ఎం.తిరుపతి వాంగ్మూలం, ఫోన్ పే స్క్రిన్ షాట్స్ సమర్పించారని కలెక్టర్ పేర్కొన్నారు. పిడి హౌసింగ్ జే. రాజేశ్వర్ ఆధ్వర్యంలో విచారణ నిర్వహించి రిపోర్ట్ అందించాల్సిందిగా ఆదేశించడం జరిగిందని, ఎం.తిరుపతి వాంగ్మూలం సంబంధించి జి లలిత ఎంపీడీవో పై చేసిన ఆరోపణలకు ఆధారాలు లభించాయని, పీడీ హౌసింగ్ చేపట్టిన విచారణకు ఎంపిడిఒజి లలిత నుంచి సహకారం లభించ లేదని రిపోర్ట్ సమర్పించినట్లు కలెక్టర్ తెలిపారు. పిడి హౌసింగ్ అందించిన రిపోర్ట్ అందుబాటులో ఉన్న సాక్షాల పరిశీలన మేరకు ముత్తారం ఎంపిడిఓ, ప్రస్తుతం పెద్దపల్లి జిల్లా గ్రామీణాభివృద్ధి అథారిటీ లో ఏ.పీ.డీ గా డిప్యూటేషన్ పై విధులు నిర్వహిస్తున్న జి.లలిత ను సస్పెండ్ చేస్తున్నట్లు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసి, సస్పెన్షన్ సమయంలో హెడ్ క్వార్టర్ వదిలి వెళ్ళడానికి వీలు లేదని కలెక్టర్ ఆ ఉత్తర్వులలో పేర్కొన్నారు.

## యూరియా బుకింగ్ యాప్‌పై అవగాహన

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** రైతులకు ఎరువుల పంపిణీని పంపిణీ మరింత పారదర్శకంగా ,సులభంగా అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ,ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ పై జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో వ్యవసాయ శాఖ అధికారులు శనివారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖ అధికారి కరుణ మాట్లాడుతూ ఎరువుల సరఫరాలో రైతులకు ఇబ్బందులు తొలగించడం ఈ యాప్ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు .యూరియా కోసం రైతులు ఇంట్లో కూర్చొని తమ మొబైల్ ఫోన్ ల ద్వారా ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ డౌన్ లోడ్ చేసుకొని లాగిన్ అయి తాము సాగు చేసిన పంట వివరాలను నమోదు చేసి యూరియా సంచులను బుక్ చేసుకోవచ్చని తెలిపారు .ఈ యాప్ ద్వారా జిల్లాలో అందుబాటులో ఉన్న యూరియా నిల్వలు ,సంబంధిత డీలర్ల వివరాలు స్పష్టంగా కనిపిస్తాయి .రైతులు సమీపంలోని డీలర్ ను ఎంచుకొని యూరియా పొందవచ్చని వివరించారు .రైతుల భూమి విస్తీర్ణాన్ని బట్టి విడుదలవారీగా యూరియా పంపిణీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.ఒక ఎకరం భూమి ఉన్న రైతులకు ఓకే విడతలో యూరియా ఒక ఎకరం నుంచి ఐదు ఎకరాల వరకు ఉన్న రైతులకు రెండు విడుతలలో యూరియా పంపిణీ చేస్తామని వెల్లడించారు .రైతు యాప్ లో నమోదు చేసుకున్న వెంటనే ప్రత్యేక ఐడి కనబడుతుందని దానికి సంబంధించిన సంక్షిప్త సమాచారం రైతు మొబైల్ కు వస్తుందని తెలిపారు .ఈ ఐడి తో పాటు రైతు ఆధార్ కార్డు జిరాక్స్ ,పట్టా పాస్ పుస్తకం కాఫీ తీసుకుని సంబంధిత డీలర్ ను సంప్రదించాలి .డీలర్ రైతు వివరాలను ధ్రువీకరించి డీలర్ లాగిన్ లో రైతు ఐడిని నమోదు చేసి రైతు కోరుకున్న యూరియా బస్తాలను పంపిణీ చేస్తారని తెలిపారు .ఈ ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారా పట్టా పాస్ పుస్తకం కలిగిన రైతులతో పాటు కౌలు రైతులు కూడా నమోదు చేసుకుని యూరియా పొందవచ్చని అధికారులు స్పష్టం చేశారు.దీనివల్ల యూరియా దుర్వినియోగం అరికట్టి అర్హులైన రైతులకు మాత్రమే ఎరువులు అందే అవకాశం కలుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి కరుణ ,వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులు పాల్గొన్నారు.

## ఇంటింటి ప్రచారంలో ఇచ్చిన మాట నిలబెట్టుకున్న కట్ట శరణ్య

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** గొల్లపల్లి మండల కేంద్రంలో ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికలప్రచారంలో భాగంగా గడుప గడుపకి వెళ్ళినప్పుడు కల్లూరి రాజేశ్వరి గత 8 సంవత్సరాలుగా మోకాళ్ల నొప్పులతో నడవలేక ఒంటరి జీవితం గడుపుతున్న ఆమె బాధను చూసిన శరణ్య కన్నీటి పర్యంతమయ్యారు.ఆమె బాధను అర్థం చేసుకున్న కట్ట శరణ్య తమ స్వంత ఖర్చులతో వీల్ చైర్ కొనిస్తానని రాజేశ్వరికి మాట ఇచ్చారు. ఓడిన నిరంతరము ప్రజా సేవలోనే ఉంటానని ఇచ్చిన మాట ప్రకారం శరణ్య శనివారం వీల్ చైర్ కొని తీసుకువచ్చి ఆమెకు అందించడం జరిగింది.ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నందుకు కాలనీవాసులు శరణ్య సేవలను అభినందించారు . ఈ కార్యక్రమంలో నాయకులు గ్రామస్థులు పాల్గొన్నారు.

## ప్రశంసా పత్రం అందుకున్న తహసీల్దార్‌కు అభినందనలు



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్:**ప్రజావాణి రెండో వార్షికోత్సవం సందర్భంగా రాష్ట్ర స్థాయి ప్రశంస పత్రం అందుకున్న కాల్వ శ్రీరాంపూర్ తహసిల్దార్ జగదీశ్వర్ రావు కు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ప్రత్యేక అభినందనలు తెలిపారు. శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్లో రాష్ట్రస్థాయి ప్రశంస పత్రం గ్రహీత కాల్వ శ్రీరాంపూర్ తహసిల్దార్ జగదీశ్వర రావు మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమం అమలులో మంచి పనితీరు కనబరిచిన కాల్వ శ్రీరాంపూర్ తహసిల్దార్ ను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి హైదరాబాద్ లోని ప్రజాభవన్ లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ చిన్నా రెడ్డి చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందించిందని, భవిష్యత్తులో కూడా ఇదే పనితీరు కనబర్చాలని, పెద్దపల్లి జిల్లా రాష్ట్ర స్థాయిలో ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారం లో ముందంజలో ఉందని, ప్రశంసిస్తూ ,ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు.

## డబ్బు క్లెయిమ్ చేసుకునేందుకు శిబిరాలు

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్:** కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని ఆర్థిక సేవలు విభాగం ఆదేశాలకు అనుగుణంగా మీ డబ్బు మీ హక్కు అనే అంశంపై కలెక్టరేట్ లో శనివారం అవగాహన శిబిరాన్ని నిర్వహించినట్లు లీడ్ బ్యాంకు మేనేజర్ వేంకటేశ్ గు తెలిపారు. క్లెయిమ్ చేసుకొని బ్యాంకు పొదుపులు, షేర్లు, డివిడెంట్స్, మ్యూచువల్ ఫండ్స్, బీమా తదితరాలకు సంబంధించి డబ్బు క్లెయిమ్ చేసుకునే అవకాశం కల్పించేందుకు శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. బ్యాంకుల్లో 10 ఏళ్లకు పైగా క్లైమ్ చేసుకుని డిపాజిట్ల వివరాలు ఆర్బిఐ ఉద్గమ్ వెబ్సైట్ ద్వారా పొందవచ్చని సూచించారు. ఆర్థికపరమైన సమస్యల పరిష్కారానికి డిసెంబర్ 31 వరకు సర్కారు వీలు కల్పించిందని తెలిపారు. డిసెంబర్ 20న నిర్వహించే అవగాహన శిబిరంలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అపర్ణ రెడ్డి డిజిఎమ్ & ఆర్ఎమ్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డివైఆర్‌హెచ్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ఇండియా,శ్రీ బి.బాలనాగు మేడమ్ ఆర్ఎమ్, తెలంగాణ గ్రామీణ బబ్యాంకు, ఎమ్‌డి ఇంతియాజ్ అలీ ఎజిఎమ్, కెడిసిసి,సిఎమ్, ఇండియన్ బ్యాంక్,ఆర్ఎమ్, ఎల్ఐసి,ఇతర జిల్లా కోఆర్డినేటర్లు మరియు బ్యాంక్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ

**ప్రజాపక్షం/చొప్పదండి:**చొప్పదండి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం లయన్స్ క్లబ్ సభ్యుడు తొడుపునూరి లక్ష్మయ్య జన్మదినం సందర్భంగా 40 మంది హమాలీ కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రీజియన్ చైర్మన్ కొల్లూరి జితేందర్ మాట్లాడుతూ చలికాలం లో చలికి ఇబ్బంది పడుతున్న హమాలీ కార్మికులకు బ్లాంకెట్స్ ఇవ్వడం చాలా అభినందనీయం అని అన్నారు. పుట్టినరోజు న ఇలా సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని క్లబ్ కార్యవర్గం ,సభ్యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.